వందేమాతరం....



చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో వందేమాతరం గేయం ఆలపిస్తున్న విద్యార్థులు



తోటగరువు ఉన్నత పాఠశాలలో వందేమాతరం గేయాలాపన

- విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సామూహిక గేయాలాపన

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం ఉదయం పది గంటలకు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అయితే పది గంటలకు గేయం ఆలపించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించగా కొన్నిచోట్ల తొమ్మిది గంటలకు రోజు వారీ జరిగే ప్రార్థనతో పాటు ముగించేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు ఎస్‌డీ అనిత, పి.శేషశైలజ, మధుసూదన్, జిల్లా పర్యాటక శాఖ ఆర్డీ జీఎస్ కల్యాణి, జిల్లా పర్యాటకాధికారి జె.మాధవి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వందేమాతర గేయం స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ప్రజల్లో దేశభక్తిని, ఐక్యతను కలిగించిందన్నారు. జడ్పీ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి, వందేమాతరం గేయరచయిత బంకించంద్ర చటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆధ్వర్యంలో సీఈవో పి.నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, పీఆర్ఎస్ఈ శ్రీనివాస్ గేయం ఆలపించారు.

ఉప ఖజానా

దొంగలపై కొరడా

సీతమ్మధార సబ్ ట్రెజరీలో కుంభకోణంపై చర్యలు

- 2011-2017 మధ్య రూ.6 కోట్లు స్వాహా అయినట్టు విజిలెన్స్ నివేదిక
- 11 మంది సీనియర్ అకౌంటెంట్లకు చార్జిమెమోలు

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):

సీతమ్మధారలోని డివిజనల్ సబ్ ట్రెజరీలో పింఛన్‌దారుల పేరిట సొమ్ములు స్వాహా చేసిన ఉద్యోగులపై ప్రభుత్వం ఎట్టకేలకు చర్యలకు ఉపక్రమించింది. అందుకు బాధ్యులైన 11 మంది సీనియర్ అకౌంటెంట్లకు చార్జిమెమోలు జారీ చేయాలని ఖజానా శాఖ విశాఖ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆదేశించింది. ఈ మేరకు పది రోజుల క్రితం వారందరికీ డీడీ చార్జిమెమోలు ఇచ్చారు.



సీతమ్మధారలోని డివిజనల్ సబ్ ట్రెజరీ కార్యాలయం

నగరంలో వేలాది మంది రిటైర్డు ఉద్యోగులకు ప్రతి నెలా సీతమ్మధార డివిజనల్ సబ్ ట్రెజరీ నుంచి పింఛన్లు బట్వాడా చేస్తుంటారు. ఏడాదికి ఒకసారి ప్రతి పింఛన్‌దారుడు లైఫ్ సర్టిఫికెట్‌ను ట్రెజరీకి అందజేయాలి. అదేవిధంగా ఎవరైనా చనిపోయినట్టయితే కుటుంబ సభ్యులు డెత్ సర్టిఫికెట్ సమర్పించాలి. 2011 సంవత్సరం వరకూ సర్టిఫికెట్లు మాన్యువల్‌గా తీసుకుని అప్‌లోడ్ చేసే విధానం ఉండేది. ఈ నేపథ్యంలో పింఛన్‌దారుడు చనిపోయినట్టు కుటుంబ సభ్యులు డెత్ సర్టిఫికెట్ ఇచ్చినా సబ్ ట్రెజరీ సిబ్బంది దానిని అప్‌లోడ్ చేయకుండా ఆ మొత్తం ప్రతి నెలా వేరొక బ్యాంకు అకౌంట్‌లో జమ చేసి డ్రా చేసుకునేవారు. మరికొంతమంది విషయంలో పింఛన్‌దారుడు చనిపోయినట్టు సర్టిఫికెట్ తీసుకువచ్చిన కుటుంబ సభ్యులతో ట్రెజరీ ఉద్యోగులు కుమ్మక్కై, వచ్చిన పింఛన్ చెరిసగం పంచుకున్నారు. ఇలా 2011 నుంచి 2017 వరకూ సుమారు రూ.ఆరు కోట్ల వరకు స్వాహా జరిగింది. సొమ్ములు పక్కదారిపట్టినట్టు 2018లో వెలుగులోకి రావడంతో అప్పట్లో కొందరు ఉద్యోగులను సస్పెండ్ చేయగా, ఇద్దరు, ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వెంకటనరసింగరావు అనే ఉద్యోగి నుంచి సుమారు రూ.95 లక్షలు రికవరీ చేశారు. ఈ కుంభకోణంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ ... మిగతా 6వ పేజీలో

మత్స్యకారులకు కేంద్రం వరం

వేట విస్తృతం

- ప్రాదేశిక జలాలు దాటి జాతీయ జలాల్లోకి వెళ్లడానికి అనుమతి
- పెరగనున్న సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు మరింత పెంచడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మత్స్యకారులకు ప్రాదేశిక జలాలు దాటి ప్రత్యేక ఆర్థిక మండలి (ఈఈజెడ్)లోకి వెళ్లి చేపలను వేటాడేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇకపై మత్స్యకారులు డీప్ సీ ఫిషింగ్ చేసి బోట్ల నిండా చేపలను వేటాడి తెచ్చుకోవచ్చు.



సముద్రంలో చేపలను వేటాడే మత్స్యకారులు తీరం నుంచి 12 నాటికల్ మైళ్ల దూరం వరకే వెళ్లాలనేది ఇప్పటివరకూ ఉన్న నిబంధన. ఇవి రాష్ట్ర జలాలు. వీటినే ప్రాదేశిక జలాలు అంటారు. ప్రతి రాష్ట్రానికి ఈ నిబంధన ఉంది. 12 నాటికల్ మైళ్లు దాటి తీరం నుంచి 200 నాటికల్ మైళ్ల వరకు జాతీయ జలాలు. దీనిని ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ (ఈఈజెడ్)గా పేర్కొంటారు. ఈ జలాల్లోకి ప్రవేశించి చేపలను వేటాడాలంటే ప్రత్యేకంగా కేంద్రం నుంచి అనుమతి తీసుకోవాలి. టూనా చేపలను వేటాడడానికి ఉపయోగించే లాంగ్ లైనర్లకు ఇలాంటి అనుమతులు ఇచ్చేవారు. కొంతమంది అత్యధిక సామర్థ్యం కలిగిన విదేశీ తయారీ బోట్లను తీసుకువచ్చి, వాటికి ఇండియన్ రిజిస్ట్రేషన్ చేయించి లైసెన్స్‌లు తీసుకునేవారు. వాటితో పోటీ పడలేక భారతీయ బోట్లు వెనుకపడేవి. దీనిపై విమర్శలు రావడంతో కేంద్ర ప్రభుత్వం ఏకంగా లైసెన్స్‌లు ఇవ్వడం మానేసింది.

కాలుష్యంతో వేట తగ్గి మరింత ముందుకు...

తీరం వెంబడి పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటు కావడం, వాటి కాలుష్య వ్యర్థాలను సముద్రంలోకి విడిచి పెట్టడం వల్ల తీరాన్ని ఆనుకొని ఉన్న ప్రాదేశిక జలాల్లో చేపల లభ్యత తగ్గిపోయింది. దాంతో మత్స్యకారులు అనధికారికంగా జాతీయ జలాల్లోకి వెళ్లి వేటాడుతున్నారు. కొన్నిసార్లు కోస్టుగార్డుకు దొరికిపోతున్నారు. ఒక్కోసారి చేపలను వెదుక్కుంటూ శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు కూడా వెళ్లిపోతున్నారు. వెనక్కి తీసుకురావడం కత్తిమీద సాముగా మారుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ జలాల్లో 200 నాటికల్ మైళ్ల వరకు ఎవరైనా వేట చేసుకోవచ్చునంటూ వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో డీప్ సీ ఫిషింగ్‌కు అవకాశం లభించింది.

జాగ్రత్తలు తప్పనిసరి

- లక్ష్మణరావు, జాయింట్ డైరెక్టర్, మత్స్యశాఖ

కేంద్రం ఉత్తర్వులు మత్స్యకారులకు పెద్ద వరం. అయితే వేటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన ట్రాన్స్‌పాండర్‌ను వేట సమయంలో ఆన్ చేసి ఉంచాలి. దానివల్ల పరిధి దాటి అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లకుండా చూసుకోవచ్చు. అదేవిధంగా జీపీఎస్ ఉంచుకోవాలి. లైఫ్ జాకెట్లు, ఫైర్ ఎక్సటింగ్ విషర్లు బోటులో పెట్టుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకుంటే మంచి వేటతో క్షేమంగా తీరానికి చేరుకోవచ్చు.

డిగ్రీ పూర్తికి మరో అవకాశం

- స్పెషల్ ఎగ్జామ్స్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్న ఏయూ అధికారులు
- బ్యాక్‌లాగ్స్‌పై భారం తగ్గింపు
- ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.15 వేలు ఫీజుగా నిర్ణయించిన గత పాలకులు
- ఇప్పుడు సాధారణ ఫీజుతోనే పరీక్షలు రాసేందుకు అనుమతించాలని ప్రస్తుత వైస్ చాన్సలర్ నిర్ణయం

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):



డిగ్రీలో సబ్జెక్టులు ఉండిపోయిన (బ్యాక్‌లాగ్స్) విద్యార్థులకు మేలు చేసేలా ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు నిర్ణయం తీసుకోబోతున్నారు. సాధారణ ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరయ్యే అవకాశాన్ని కల్పించబోతున్నారు. ఏయూ పరిధిలో 190కుపైగా డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. గత పదేళ్లలో ఆయా కాలేజీల్లో చదివిన పలువురు విద్యార్థులు వేర్వేరు కారణాలతో డిగ్రీ పూర్తి చేయలేకపోయారు. కొంతమందికి మూడు నుంచి పదికిపైగా సబ్జెక్టులు బ్యాక్‌లాగ్స్ ఉన్నాయి. అటువంటి వారంతా అవకాశం లభిస్తే డిగ్రీ పూర్తిచేయాలని భావిస్తున్నారు. అయితే, ఒక్కో సబ్జెక్టుకు రూ.15 వేలు ఫీజుగా గత పాలకులు నిర్ణయించారు. అంటే ఒక్కో విద్యార్థి తనకు ఉన్న సబ్జెక్టులను బట్టి కనీసం రూ.15 వేల నుంచి ... మిగతా 6వ పేజీలో

కేజీహెచ్‌కు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

గురువారం రాత్రి 12 గంటల సమయంలో కొలిక్కివచ్చిన సమస్య

- ఊపిరి పీల్చుకున్న రోగులు
- ఆస్పత్రి అధికారుల మధ్య సమన్వయలోపంతోనే సమస్య పరిష్కారంలో జాప్యం
- ఉన్నతాధికారులు తలంటిన తరువాత గానీ ఈపీడీసీఎల్‌కు సమాచారం

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రి కేజీహెచ్‌లో ఎట్టకేలకు గురువారం అర్ధరాత్రి 12 గంటల గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు.

మధ్యాహ్నం రెండు గంటలకు మార్చురీ ఎదురుగా గల క్రిటికల్ కేర్ బ్లాక్ వద్ద ర్యాంప్ నిర్మాణ పనులు చేస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన కేబుల్స్ తెగిపోయాయి. దీంతో ఆస్పత్రిలోని భావనగర్, రాజేంద్రప్రసాద్, పీడియాట్రిక్, ఆర్థో, గైనిక్ విభాగాలతోపాటు సీఎస్ఆర్ బ్లాక్‌కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. సాయంత్రం ఏడు గంటలకు రోగులు పడుతున్న ఇబ్బందులను పలువురు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ వీడియో క్షణాల్లోనే రాష్ట్ర స్థాయిలో సంచలనంగా మారింది. దీంతో ఆరోగ్య శాఖ రాష్ట్ర స్థాయి అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రి అధికారులను అప్రమత్తం చేశారు. ఆస్పత్రి అధికారులు వెంటనే సమస్యను ఏపీఈపీడీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈపీడీసీఎల్ సిబ్బంది, ఆస్పత్రికి చెందిన ఎలక్ట్రికల్, ఏపీఎంఎస్ఐడీసీ సిబ్బంది కలిసి విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేశారు. కొన్ని గంటలపాటు శ్రమించి రాత్రి 12 గంటలు సమయానికి వార్డులకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీంతో రోగులు ఊపిరి పీల్చుకున్నారు. అప్పటివరకూ వార్డులు బయట, చెట్ల కింద విశ్రాంతి తీసుకున్న రోగులు వార్డుల్లోకి వెళ్లారు.



మార్చురీ వద్ద విద్యుత్ కేబుల్ పనులు చేపట్టిన ప్రాంతం

తప్పిన పెను ప్రమాదం..

కేజీహెచ్‌లో ప్రతిరోజూ ఇన్‌పేషెంట్లుగా సుమారు 1,500 మంది వైద్య సేవలు పొందుతుంటారు. అందులో సుమారు 500 మంది వరకూ అత్యవసర సేవలు పొందుతుంటారు. వీరికి ఆక్సిజన్ అందించాలంటే తప్పనిసరిగా విద్యుత్ సరఫరా ఉండాలి. గురువారం విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అత్యవసర విభాగాలకు విద్యుత్ అందించేందుకు అనుగుణంగా ఉన్న ఐదు జనరేటర్లను వినియోగించారు.

సమన్వయ లోపమే కారణమా.?

సాధారణంగా కేజీహెచ్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం అన్నది అరుదుగా జరుగుతుంది. ఎప్పుడైనా సమస్య తలెత్తినా నిమిషాల్లోనే పరిష్కరిస్తుంటారు. అయితే, గురువారం సమస్యను అధికారులు సీరియస్‌గా తీసుకోలేదని చెబుతున్నారు. ఆస్పత్రి ఉన్నతాధికారి నగరంలో లేరు. ఆమె లేనప్పుడు ఆస్పత్రిలో వ్యవహారాలను చూసుకోవాల్సిన ... మిగతా 6వ పేజీలో

రోడ్డు ప్రమాదంలో

ఇద్దరి మృతి

- రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొన్న ద్విచక్ర వాహనచోదకుడు



మృతి చెందిన వల్లూరు రమణమ్మ (58)



చికిత్స పొందుతూ మృతి చెందిన పారిక నాగరాజు (48)

కూర్మన్నపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై అగనంపూడి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మరొకరు గాయపడ్డారు. ఇందుకు సంబంధించి దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాజువాక పైడిమాంబ కాలనీకి చెందిన వల్లూరు శ్రీనివాసరావు, భార్య రమణమ్మ (58), కుమారుడు తారక్‌తో కలిసి అగనంపూడిలో అద్దెకు ఉంటున్నారు. పాల బూత్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రమణమ్మ శుక్రవారం పని మీద కూర్మన్నపాలెం వచ్చింది. తిరిగి ఆటోలో అగనంపూడి చేరుకుంది. ఆటో దిగి ఇంటికి వెళ్లేందుకు జాతీయ రహదారి ... మిగతా 6వ పేజీలో

అమ్మవారి సన్నిధిలో

కనకమహాలక్ష్మి దేవస్థానం ఈవోపై స్థానికుల ఫిర్యాదు

కొత్త సంప్రదాయాలేల?

ఎమ్మెల్యే ఎదుట పంచాయితీ

- రాత్రిపూట ఆలయం గేట్లకు తాళాలు వేస్తున్నారన్న నాయకులు
- భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని అధికారులకు శాసనసభ్యుడి హితవు

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):

కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ముందు పంచాయితీ నడిచింది. వందేమాతరం గీతం 150 సంవత్సరాల కార్యక్రమంలో పాల్గొనడానికి ఎమ్మెల్యే ఆలయానికి రాగా, స్థానిక నాయకులు వచ్చి ఈఓ శోభారాణి వ్యవహార శైలిపై ఫిర్యాదు చేశారు. స్థానిక కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ఇతరులు పలు విషయాలు ప్రస్తావించారు.



కనకమహాలక్ష్మి స్వయంభూ అమ్మవారని, భక్తులు స్వయంగా అభిషేకాలు, పూజలు చేసుకుంటారని, అందుకు 24 గంటలు అవకాశం ఉండేదని, ప్రస్తుత ఈవో వచ్చిన తరువాత రాత్రి 11 గంటల తరువాత ఆలయ గేట్లకు తాళాలు వేసేస్తున్నారని ఫిర్యాదు చేశారు. గతంలో ఎప్పుడూ ఇలా లేదని వారు పేర్కొన్నారు. స్థానికంగా ఉండే మత్స్యకారులు రాత్రి పూట వేటకు వెళ్లేముందు ఆలయానికి వచ్చి అమ్మవారికి కొబ్బరికాయ కొట్టి దండం పెట్టుకొని వెళతారని, ఇప్పుడు ఆ అవకాశం లేకుండా చేశారని ఆరోపించారు. అమ్మవారి విగ్రహానికి వెండి తాపడం ఉందని, భద్రత కోసం తాళాలు ... మిగతా 6వ పేజీలో

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో

అర్ధరాత్రి వరకూ ఏసీబీ తనిఖీలు

- ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ ఆధారంగా సోదాలు
- ప్రొసీజర్, సిబ్బంది ప్రవర్తనపై కూడా దృష్టి
- పరిశీలనలో గుర్తించిన అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారుల వెల్లడి
- నగదుగా దొరికింది రూ.10 వేలు మాత్రమే
- కార్యాలయాల్లో డాక్యుమెంట్లు తక్షణమే తీసుకువెళ్లాలని సబ్ రిజిస్ట్రార్‌ల లేఖలు

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలోని మూడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ అధికారులు చేపట్టిన సోదాలు గురువారం రాత్రి ఒంటి గంటతో ముగిశాయి. రెండు రోజుల పరిశీలనలో గుర్తించిన అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తనిఖీ అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి శాఖ పనితీరుపైనా ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు తీసుకుంటోంది. వాటి ద్వారా వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఏసీబీని ఆదేశించింది. రిజిస్ట్రేషన్లకు లంచాల డిమాండ్, అక్కడి సిబ్బంది దుష్ప్రవర్తన, ప్రొసీజర్‌ను పక్కనపెట్టి అధికారులు వ్యవహరించే తీరు, తదితర అంశాలపై ఏసీబీ అధికారులు అధికంగా దృష్టి పెట్టినట్టు సమాచారం.

పెండింగ్ డాక్యుమెంట్లే అధికం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సమర్పించాల్సిన పత్రాల్లో ఏవైనా లేనప్పుడు వాటి రిజిస్ట్రేషన్ పెండింగ్ పెడతారు. సూచించిన పత్రాలు తీసుకువచ్చాక రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తారు. అంతవరకు పెండింగ్ నంబర్‌తో పక్కన ఉంచుతారు. ఇది ఒక రకం పెండింగ్. ప్రభుత్వ భూములను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్న పేదలకు టీడీపీ ప్రభుత్వం గతంలో పట్టాలు ... మిగతా 6వ పేజీలో



కృష్ణ మనోహర్‌ను అభినందిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ఢిల్లీ విజ్ఞాన యాత్రకు లక్ష్మీపురం విద్యార్థి

భీమునిపట్నం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సైన్స్ సిటీ, సమగ్రశిక్ష సంయుక్తంగా చేపట్టిన ఢిల్లీ విజ్ఞాన యాత్రకు మండలంలోని లక్ష్మీపురం హైస్కూల్ విద్యార్థి కనకల కృష్ణ మనోహర్ కూడా వెళ్లారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభ గల విద్యార్థులను పాఠశాల విద్యా శాఖ రాష్ట్రవ్యాప్తంగా జిల్లాకు ఇద్దరు చొప్పున 52 మందిని సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌లో భాగంగా ఢిల్లీకి పంపించింది.ఈ బృందంలో లక్ష్మీపురం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కృష్ణ మనోహర్ కూడా ఉన్నాడు. మూడు రోజుల పర్యటనలో భాగంగా మొదటి రోజు ఢిల్లీలోని రష్యన్ సెంటర్ ఆఫ్ సైన్స్ అండ్ కల్చర్ (రష్యన్ హౌస్)ను చూపించారు. శుక్రవారం నేషనల్ సైన్స్ మ్యూజియం సందర్శించారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును కలిశారు. ఆయన విద్యార్థుల బృందానికి విందు ఏర్పాటు చేశారు.

'కార్యకర్తలకు అండగా ఉంటా'



మృతుడి భార్యకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా

సింహాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా.. అండగా ఉంటానని ఎమెల్యే గంటా శ్రీనివాసరావు భరోసా ఇచ్చారు. 98వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త బాడిత బోయిన అప్పలస్వామి ఇటీవల మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున మంజూరైన ప్రమాద బీమా చెక్కును శుక్రవారం ఆయన ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పిసిని వరాహ నరసింహం, పార్టీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా తులసీ దళార్చన

సింహాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అప్పన్న స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సహస్ర తులసీ దళార్చన శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్స వమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు.భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నారసింహ సహస్ర నామావళి పఠి స్తూ తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు.

నిత్యాన్నదానానికి రూ. 2 లక్షల విరాళం

సింహాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి విజయనగరం జిల్లాకు చెందిన తాడి శ్రీధర్, ఒంగోలు ప్రాంతానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి, సంధ్యారాణి దంపతులు వేర్వేరుగా రూ. లక్ష చొప్పున విరాళం సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో దేవాలయ అన్నప్రసాద విభాగం పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావు, ప్రజా సంబంధాల అధికారి సూర్యనారాయణలకు దాతలు శుక్రవారం అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు అధికారులు స్వామి వారి అంతరాలయ దర్శనం కల్పించి శేషవస్త్రంతో సత్కరించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

సాగర్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ప్రముఖ శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ జయంతి పురస్కరించుకుని జాతీయ సైన్స్ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రామన్ విగ్రహానికి వీసీ ఎరోల్ డిసోజా, స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ అనంత రామకృష్ణ, తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలల విద్యార్థులకు గీతంలోని సైన్స్, ఇంజనీరింగ్ ప్రయోగశాలలను సందర్శించే అవకాశం కల్పించారు.ఈ కార్యక్రమంలో గీతం ప్రో వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఉప ఖజానా దొంగలపై కొరడా

... 5వ పేజీ తరువాయి

చేపట్టింది. సుదీర్ఘంగా విచారించి 2021లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అప్పటి నుంచి పలుమార్లు విజిలెన్స్ అధికారులు వార్షిక నివేదికలలో ట్రెజరీ కుంభకోణం విషయాన్ని ప్రస్తావిస్తూ వచ్చారు. చివరకు ఈ ఏడాది ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖను ఆదేశించింది. దీంతో 2011 నుంచి 2017 వరకు జరిగిన పింఛన్ సొమ్ముల స్వాహాకు సంబంధించి అప్పట్లో సీతమ్మధార డివిజనల్ సబ్‌ట్రెజరీలో పనిచేసి ప్రస్తుతం సీనియర్ అకౌంటెంట్లుగా ఉన్న 11 మందిపై చర్యలు తీసుకోవాలని విశాఖలోని ఖజానా కార్యాలయం డీడీని ఖజానా రాష్ట్ర డైరెక్టర్ ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం జిల్లా కార్యాలయంతోపాటు అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్న 11 మందికి ఆయన చార్జిమెమోలు జారీచేశారు. పింఛన్ల సొమ్ము స్వాహాకు సంబంధించిన వ్యవహారంలో ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. చార్జిమెమోలు అందుకున్న వారిలో చినఅప్పలరాజు, శ్రావ్య గోపాల్, హైమా, పైడిరాజు, అశోక్, రాజు ప్రకాశ్, బేబీ చైతన్య, తదితరులు ఉన్నారు. వీరిలో కొందరు కొంత సమయం కావాలని డీడీని కోరారు.

అమ్మవారి సన్నిధిలో కొత్త సంప్రదాయాలేల?

... 5వ పేజీ తరువాయి

వేస్తున్నామని ఈఓ శోభారాణి సమాధానం ఇవ్వగా, దానిని స్థానికులు ఖండించారు. రాత్రిపూట వెండి తాపడం తీసేస్తున్నారని స్పష్టం చేశారు. తెల్లవారుజామున 5-6 గంటల మధ్య పూజారులు వచ్చి పూజలు చేశాకే ఇతరులను అమ్మవారి సన్నిధికి అనుమతించే సంప్రదాయం ఈవో తీసుకువచ్చారని ఫిర్యాదు చేశారు. అమ్మవారి దర్శనాలకు ఇలాంటి నిబంధనలు గతంలో ఎన్నడూ లేవన్నారు. అయ్యప్పస్వాములు తెల్లవారు జామున నాలుగు గంటలకు వస్తే వారిని మండపం దాటి ముందుకు వెళ్లనివ్వడం లేదని స్థానిక కార్పొరేటర్ దంపతులు ఫిర్యాదు చేశారు. అమ్మవారిపై పాలు, పెరుగు, కొబ్బరికాయల నీళ్లు నేరుగా వేసేవారమని, ఇప్పుడు ప్రత్యేక పాత్రలు పెట్టి...వాటిలో పోయమంటున్నారని, అవన్నీ నిండాక అమ్మవారి తలపై జల్లెడ పెట్టి అందులో పోస్తున్నారని వారంతా ఎమ్మెల్యేకు వివరించారు. ఈ ఆలయంలో భక్తులు ఎవరి పూజ వారు చేసుకునే సంప్రదాయం ఉందని, దానికి ఈఓ శోభారాణి అడ్డంకులు సృష్టిస్తున్నారని, కొత్త పద్ధతులు తొలగించి పాత విధానాల ప్రకారమే అన్నీ జరిగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. అన్నీ విన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్...భక్తుల మనోభావాలు, ఆలయ సంప్రదాయాల ప్రకారం ముందుకు వెళ్లాలని, స్థానికులను ఇబ్బందులకు గురిచేయవద్దని ఈఓకు సూచించారు.



భీమిలి డైట్ కళాశాలలో గేయం ఆలపిస్తున్న ఛాత్రోపాధ్యాయులు



వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు



తగరపువలసలో వెయ్యి అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న అవంతి ఇంజనీరింగ్ విద్యార్థులు

ప్రతి నోటా.. వందేమాతరం

- ప్రతిధ్వనించిన జాతీయ గేయం
- ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో ఆలపించిన అధికారులు, విద్యార్థులు

భీమునిపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థల్లో శుక్రవారం వందేమాతరం గేయం ఆలపించారు. వందే మాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తి కావడంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. భీమునిపట్నంలోని డైట్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు, సిబ్బంది గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వందేమాతరం గేయం నేపథ్యాన్ని వివరించారు.ప్రతి విద్యార్థి, పౌరులు దేశభక్తి కలిగి ఉండాలని, దేశ ఔన్నత్యాన్ని కాపాడాలని కోరారు. వందేమాతరం గేయం జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిందని చెప్పారు. అనంతరం గేయాన్ని రచించిన బంకిం చంద్ర ఛటర్జీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అలాగే భీమిలి పోలీసుస్టేషన్‌లో సీఐ తిరుమలరావు, ఎస్‌ఐ భరత్‌కుమార్ రాజు, సిబ్బంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ శివరాణి, హెచ్‌ఎం రమణ, ఉపాధ్యాయులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ సురేఖ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలపించారు.

వెయ్యి అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

భీమునిపట్నం (రూరల్) : అవంతి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. వెయ్యి అడుగుల జాతీయ జెండాను తయారు చేసి ప్రదర్శించారు. అంతకుముందు ప్రిన్సిపాల్ మురళీకృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు, అధ్యాపకులు సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చంద్రశేఖర్, పలు విభాగాల అధిపతులు పట్నాయక్, రాము చంద్రశేఖర్, యోగా టీచర్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

తగరపువలసలో...

తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వందేమాతరం గేయాన్ని సామూహికంగా ఆలపించారు. వందేమాతరం జాతీయ గేయంగా ప్రకటించి 150 ఏళ్లు పూర్తి కావడంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి మాట్లాడుతూ జాతీయ గేయం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సీతారత్నం, సీతంనాయుడు, నాగ రాజశ్రీ, నారినాయుడు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో..

ఆనందపురం : గుడిలోవ విజ్ఞాన విహార ఆశ్రమ పాఠశాలలో వందే మాతరం గేయాన్ని ఆలపించారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు తమ్మిన నరసింగరావు ముఖ్య అతిథిగా హాజరై గేయం ఆవిర్భావం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎండాడలో...

ఎండాడ : వందే మాతరం గేయం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎండాడ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి. ఉషారాణి, ఎన్‌సీసీ మాస్టర్ హరికుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే విశాలాక్షినగర్‌లో ఉన్న బీవీకే పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో నగర బీజేపీ అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామ్‌రాజు పాల్గొని వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో బీవీకే స్కూల్ కరస్పాండెంట్ నరసింగరావు, హెచ్‌ఎం మాధవి, ప్రిన్సిపాల్ రమా, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలంలో..

సింహాచలం : వందే మాతరం గేయం ఆలాపనతో ప్రజల్లో దేశ భక్తి పెంపొందుతుందని అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఇముంది పైడిరాజు అన్నారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి ప్రతిఒక్కరూ దేశభక్తిని అలవరచుకోవాలని, అందుకు క్రమశిక్షణ, సమాజం పట్ల సేవాభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో 98వ వార్డు బీజేపీ నాయకులు రచ్చా ఆనంద శ్రీనివాస వర్మ, అప్పలనాయుడు, శరత్, రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు : ఎమ్మెల్యే గంటా

కొమ్మాది, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండడం సరికాదని, అటువంటి వారిని ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హెచ్చరించారు.శుక్రవారం ఆయన జోన్-2 కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.పట్టణ ప్రణాళిక విభాగం, విద్యుత్, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలపై ఎక్కువ ఫిర్యాదులు రావడంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన అర్జీలను ఉన్నతాధికారులకు పంపించినంత మాత్రాన పరిష్కారం అయినట్టు కాదని, ఆ సమస్య పరిష్కారం అయ్యే వరకు చూడాలని సూచించారు. ఇకపై ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తానన్నారు. గ్రీవెన్స్‌కు ముందు క్షేత్రస్థాయిలో పర్యటించి పార్కులు, గెడ్డలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, అనధికార నిర్మాణాలను పరిశీలిస్తానని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా ప్రజలకు నమ్మకం కలిగేలా నిర్వహించాలని చెప్పారు. ప్రతి వారం కార్యక్రమం జరుగుతున్నా.. ప్రజా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పీజీఆర్‌ఎస్ అర్జీలను ఎమ్మెల్యేలు పరిష్కరించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఇకపై ప్రతి శుక్రవారం తానే గ్రీవెన్స్ నిర్వహిస్తానన్నారు. ఇక నుంచి గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. కాగా ఎమ్మెల్యే నిర్వహించిన గ్రీవెన్స్‌కు 25 ఫిర్యాదులు అందినట్టు జడ్సీ కనక మహాలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ శాంతిరాజు, కార్పొరేటర్లు గాడు చిన్నకుమారి లక్ష్మి, మొల్లి హేమలత, లొడగల అప్పారావు, నాయకులు చిక్కాల విజయ్‌బాబు, మొల్లి లక్ష్మణరావు, గరె గురునాథ్, నాగోతి సత్యనారాయణ, వాండ్రాసి అప్పలరాజు, కె. అచ్యుతరావు, మామిడి దుర్గారావు, నమ్మి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వినతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

తగరపువలస,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఆనందపురంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. వీటిలో 9వ తరగతి విద్యార్థి బోర గణేశ్, 10వ తరగతి చదువుతున్న బైరెడ్ల గణేశ్ అండర్ 17 విభాగంలో ప్రతిభ చూపడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల పీడీ తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం ఆదినారాయణ, విద్యా కమిటీ చైర్మన్ చిట్టిబాబు శుక్రవారం అభినందించారు.

జోరుగా రగ్గుల అమ్మకం



క్రికెట్ స్టేడియం సమీపంలో విక్రయిస్తున్న రగ్గులు

మధురవాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చలికాలం నేస్తాలు వచ్చేశాయ్. శీతాకాలం ప్రారంభం కావడంతో పీఎంపాలెం క్రికెట్ స్టేడియం నుంచి మారికవలస వరకు రోడ్లకు ఇరువైపులా రగ్గులు, స్వెట్టర్లు, మఫ్లర్లు, ఊలు వస్త్రాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పలు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు అక్టోబరు నుంచి జనవరి వరకు ఈ అమ్మకాలను కొనసాగిస్తారు.

సీఐటీయూ నాయకుడు రమేశ్ మృతి పట్ల నివాళి

తగరపువలస,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలసలోని సీఐటీయూ కార్యాలయంలో ఆ సంఘం నాయకుడు రమేశ్ వర్ధంతి సభ శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు రమేశ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. జూట్‌మిల్లు కార్మిక సంఘం నాయకుడిగా, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడిగా రమేశ్ చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో సీఐటీయూ భీమిలి జోన్ అధ్యక్షుడు మూర్తి, కార్యదర్శి అప్పలనాయుడు, మండల అధ్యక్షుడు రాము, పెంట రాజు, ఎ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

ఆనందపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసిన కె. ప్రేమానందరావు రిటైర్ కావడంతో సహచర ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం కె.కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వెల్లంకి హెచ్‌ఎం రమేశ్ కుమార్, అడవివరం హెచ్‌ఎం పైడిరాజు, నాయకులు చందక సూరిబాబు, ఏఎంసీ చైర్మన్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అర్ధరాత్రి వరకూ ఏసీబీ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

ఇచ్చింది. వాటికి ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా కన్వేయన్స్ డీడ్స్ ఇస్తోంది. వీఆర్‌ఓల ద్వారా మండలాల తహశీల్దార్లు ఈ రిజిస్ట్రేషన్లను చేయిస్తున్నారు. జిల్లాలో 24 వేల రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 13 వేలు పూర్తయ్యాయి. ఆక్రమితదారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేసిన తరువాత ఆ డాక్యుమెంట్‌ను తహశీల్దార్ సూచించిన వీఆర్‌ఓకే ఇస్తారు. కక్షిదారులకు ఇవ్వరు. అయితే వీఆర్‌ఓలు గ్రామంలో అన్ని రిజిస్ట్రేషన్లు పూర్తయిన తరువాత వచ్చి తీసుకువెళతామంటూ వాటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉంచేస్తున్నారు. ఇవి రెండో రకం పెండింగ్ డాక్యుమెంట్లు. ఇలాంటివి ఒక్కో కార్యాలయంలో 200 వరకూ ఉన్నాయి. వీటిని కూడా ఏసీబీ అధికారులు తప్పుబట్టారు. ఎప్పటికప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని సబ్ రిజిస్ట్రార్లను ప్రశ్నించారు. అందులో తమ జాప్యం లేదని రెవెన్యూ సిబ్బందే రావడం చెప్పినట్టు సమాచారం. ఏసీబీ అధికారుల అభ్యంతరం చెప్పిన నేపథ్యంలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రెవెన్యూ అధికారులకు వాటిని తీసుకువెళ్లాల్సిందిగా శుక్రవారం లేఖలు వెళ్లాయి.

విశాఖలో దొరికింది రూ.10 వేలు మాత్రమే

ఏసీబీ అధికారులు విశాఖ జిల్లాలో మూడు కార్యాలయాల్లో సోదాలు చేస్తే సూపర్‌బజార్ (ఆర్‌వో) కార్యాలయంలో మాత్రమే రూ.10 వేల నగదు ఒక పెళ్లి కార్డు కవరులో దొరికింది. అది ఎవరు తెచ్చారు?, ఎవరికి ఇచ్చారు?...అనే వివరాలు బయటకు రాలేదు. మధురవాడ, పెదగంట్యాడ కార్యాలయాల్లో ఏమీ లభించలేదు. పలువురు డాక్యుమెంట్ రైటర్ల వద్ద నగదు, వారి ఫోన్ల లావాదేవీలను ఏసీబీ అధికారులు పరిశీలించారు. వాటి వివరాలు కూడా నమోదు చేసుకున్నారు.

డిగ్రీ పూర్తికి మరో అవకాశం

... 5వ పేజీ తరువాయి

రూ.లక్షకుపైగా చెల్లించాల్సి ఉంటుంది. అందుకే పెద్దగా ఎవరూ ముందుకురాలేదు. ఈనేపథ్యంలో నామమాత్రపు ఫీజు చెల్లించి ఒకేసారి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు రాసుకునేందుకు అవకాశం కల్పించాలని తాజాగా వర్సిటీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కొద్దిరోజుల్లో షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ తెలిపారు. ఇది వందలాది మంది విద్యార్థులకు మేలు చేస్తుందన్నారు. ఇప్పుడు విద్యార్థులు చెల్లిస్తున్న ఫీజునే వసూలు చేయనున్నారు.

తత్కాల్ ఫీజు రద్దు

వర్సిటీ అధికారులు మరో కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. వివిధ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అత్యవసరంగా కావాలంటే ప్రస్తుతం నిర్ణీత రుసుము కంటే కొంచెం ఎక్కువ మొత్తం (తత్కాల్ పద్ధతి) వసూలు చేస్తున్నారు. తత్కాల్ విధానంలో సర్టిఫికెట్లను ఒకటి, రెండు రోజుల్లో ఇస్తున్నారు. అయితే, తత్కాల్ ఫీజు విద్యార్థులకు భారంగా మారుతుందని గ్రహించిన అధికారులు దానిని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులకు నిజంగానే అత్యవసరంగా సర్టిఫికెట్లు కావాల్సి వస్తే...తత్కాల్ విధానంలో ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఒకరోజులో ఇచ్చేలా చర్యలు చేపడుతున్నారు. దీనికి సంబంధించి ఆదేశాలను ఇప్పటికే ఎగ్జామినేషన్ విభాగానికి ఇచ్చినట్టు వైస్ చాన్సలర్ వెల్లడించారు.

కేజీహెచ్‌కు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

... 5వ పేజీ తరువాయి

ఉన్నతాధికారులు పట్టనట్టు వ్యవహరించడం వల్లే రోగులు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చిందంటున్నారు. ఈ సమస్యకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన తరువాత ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు తలంటిన తరువాతే ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఆస్పత్రి అధికారులకు సమాచారాన్ని అందించినట్టు చెబుతున్నారు. అప్పటివరకూ ఆస్పత్రిలో ఉన్న ఎలక్ట్రికల్ సిబ్బందితోనే సమస్యను పరిష్కరించే ప్రయత్నాలు చేశారు. అదే సమస్య ఉత్పన్నమైన వెంటనే ఆస్పత్రి అధికారులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి ఉంటే సాయంత్రానికి పరిష్కారమయ్యేదని చెబుతున్నారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణిని వివరణ కోరగా తాను కోర్టు పనులు నిమిత్తం విజయవాడ వెళ్లానన్నారు. అయినప్పటికీ సమస్య తెలిసిన వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరించే ప్రయత్నం చేసినట్టు తెలిపారు. నేరుగా విజయవాడ నుంచి ఆస్పత్రికే వచ్చి పనులను పర్యవేక్షించానని, అప్పటికే డిప్యూటీ సూపరింటెండెంట్లు, అడ్మినిస్ట్రేటర్, ఇతర అధికారులు పనులు జరుగుతున్న ప్రాంతంలోనే ఉన్నారన్నారు. కాగా ఆస్పత్రిలో నిర్వహణ పనుల కారణంగా తలెత్తిన సమస్యను సిబ్బందితో కలిసి పరిష్కరించి రాత్రి 11.45 గంటలు సమయంలో సరఫరా పునరుద్ధరించామని ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్‌ఈ శ్యాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

గుడివాడలో 59 మందికి వైద్య పరీక్షలు

భీమునిపట్నం రూరల్,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) :చిప్పాడ దివీస్ కర్మాగారం ఆధ్వర్యంలో శుక్రవారం గుడివాడ ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిణి లక్ష్మి 59 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందించారు. శిబిరానికి పరిసర గ్రామాలైన శ్రీరామనగర్, పాత చెరుకుపల్లి, ఎరుసుపేట పాఠశాలలకు చెందిన విద్యార్థులు కూడా హాజరయ్యారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొమ్మాది, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం వచ్చాక ఐదో వార్డులో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. శుక్రవారం సాయిరాం కాలనీ, డ్రైవర్స్ కాలనీలో రూ. 12 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, ఏఈ తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో క్యాన్సర్‌పై అవగాహన

తగరపువలస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్యాన్సర్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు రవీంద్ర మాట్లాడుతూ క్యాన్సర్ ప్రాణాంతకం కాదని, ముందస్తు జాగ్రత్తలతో నివారించవచ్చునని చెప్పారు. ఆరోగ్యకరమైన జీవన శైలి అలవర్చుకోవడం, క్రమం తప్పకుండా స్క్రీనింగ్ టెస్టులు చేయించుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రామకృష్ణ, ఎచ్చెర్ల హరి, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి



పల్లకీపై ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లు

సింహాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో అమ్మవార్ల శుక్రవారపు తిరువీధి వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం స్వామివారి పవళింపు సేవ తరువాత సింహవల్లీ తాయారు, చతుర్భుజి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచారు. షోడశోపచారాలు సమర్పించిన తరువాత ఆలయ విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితులు వేదపారాయణలు చేస్తుండగా బేడామండపంలో తిరువీధి జరిపారు. అష్టదిక్పాలకులకు పూజలు చేసి కర్పూర నీరాజనాలిచ్చారు.

తడి, పొడి చెత్త సేకరణపై శిక్షణ

ఆనందపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) :వెల్లంకి పంచాయతీలో జిల్లాలోని డ్వాక్రా మహిళలకు సంపద తయారీ కేంద్రాల్లో తడి,పొడి చెత్త సేకరణపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు మహిళలను ఎంపిక చేసి శిక్షణకు తీసుకువచ్చారు. శిక్షణను జిల్లా డిప్యూటీ పంచాయతీ అధికారి నిర్మలాదేవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రామారావు, సర్పంచ్ లక్ష్మణరావు, ఎంపీడీఓ జానకి, తదితరులు పాల్గొన్నారు.

గొల్లలపాలెం కేజీబీవీని సందర్శించిన డీఈవో



రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

భీమునిపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గొల్లలపాలెం కేజీబీవీని డీఈఓ ప్రేమకుమార్ శుక్రవారం సందర్శించారు. ల్యాబ్, స్టోర్ రూమ్, కిచెన్, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే రికార్డులు, అసెస్మెంట్ పుస్తకాలు తనిఖీ చేశారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కేజీహెచ్‌లో మహిళ మృతి

- విద్యుత్ సరఫరా లేక ఆక్సిజన్ అందలేదు : బంధువుల ఆరోపణ

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లో గురువారం రాత్రి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మహిళ మృతి చెందినట్టు ఆమె బంధువులు ఆరోపించారు. తెలంగాణలోని దోమకొండ ప్రాంతానికి చెందిన వి.దేవి విశాఖలోని మర్రిపాలెంలో తన బంధువుల ఇంటికి వచ్చి అస్వస్థతకు గురై ఈనెల 6న తెల్లవారుజామున 3 గంటలకు కేజీహెచ్‌లో చేరింది. ఆ సమయంలో తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు ఉండేవి. పరీక్షల అనంతరం వైద్యులు ఆమెకు అత్యవసర చికిత్స అందించారు. పరిస్థితి మెరుగుపడడంతో సాధారణ వార్డుకు తరలించారు. గురువారం రాత్రి 11 గంటలకు పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ఘటనపై ఆమె సోదరి మాట్లాడుతూ ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా లేక ఆక్సిజన్ అందకపోవడంతో దేవి ఉక్కిరిబిక్కిరై మృతి చెందినట్టు ఆరోపించారు. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణి వివరణ ఇచ్చారు. ఆ మహిళ ఆసుపత్రిలో చేరాక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆక్సిజన్, రక్తపోటు నార్మల్‌గా ఉండడంతో సాధారణ వార్డుకు తరలించి చికిత్స కొనసాగించామన్నారు. రాత్రి సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందినట్టు వివరణ ఇచ్చారు. దేవికి మద్యం తాగే అలవాటు ఉండడంతో కాలేయ సమస్య కూడా ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి

దాటుతుండగా అనకాపల్లి నుంచి గాజువాక వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న మునగపాక మండలం చూచుకొండ గ్రామానికి చెందిన సారిక నాగరాజు (48), అతని కుమారుడు జవహర్‌లు ఢీకొట్టారు. దీంతో రమణమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. తీవ్ర గాయాలపాలైన నాగరాజు, జవహర్‌లను కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సారిక నాగరాజు (48) మృతిచెందారు. జవహర్‌కు గాయాలయ్యాయి. డిగ్రీ పూర్తిచేసిన జవహర్ ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. తారక్ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జవహర్ నుంచి ఫిర్యాదు రావాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

దేశభక్తి రగిలించిన వందేమాతరం

» డీఐజీ గోపీనాథ్‌రెడ్డి » పలు చోట్ల ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల సంబరాలు



మద్దిలపాలెం : జాతీయ గీతం ఆలపిస్తున్న డీఐజీ గోపీనాథ్ రెడ్డి



పెదవాల్తేర్ : వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపిస్తున్న బీజేపీ నేతలు

మద్దిలపాలెం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది భారతీయుల్లో దేశభక్తి జ్వాలలు రగిలించిన గేయం వందేమాతరమని డీఐజీ గోపినాథ్ జెట్టి పేర్కొన్నారు. విశాఖ రేంజ్ కార్యాలయంలో శుక్రవారం వందేమాతరం 150 ఏళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1875లో బంకించంద్ర చటర్జీ రాసిన వందేమాతరం గేయం తొలిసారిగా ఆనంద్ మఠ్ నవలలో వచ్చిందన్నారు. అప్పటి నుంచి వందేమాతరం గేయం భారతీయుల్లో జాతీయాభిమానానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో కార్యాలయం మేనేజర్ బాలసూర్యారావు, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నూట యాభై ఏళ్ల వందేమాతర గీతాన్ని వేడుకగా విద్యార్థులు ఆలపించి, దేశభక్తిని చాటారు. ఎంవీపీ కాలనీలోని సత్యసాయి విద్యా విహార్‌లో శుక్రవారం గీతాలపన కార్యక్రమాన్ని సంబరంగా నిర్వహించారు. గీతం ప్రాముఖ్యతను తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఉపాధ్యాయులు వివరించారు.

వుడా హెల్త్ ఎరీనాలో ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ ఆధ్వర్యంలో క్రీడాకారులు వందేమాతర గీతాన్ని ఆలపించారు. కేఎస్సార్ అకాడెమీ సభ్యులు పాల్గొన్నారు. ఎంవీపీ కాలనీ రైతు బజార్‌లో రైతులు, సిబ్బంది అందరూ కలసి వందేమాతర గీతాన్ని పాడారు. ఎస్టేట్ అధికారి వరహాలు, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ మొల్లి శోభ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నగర కార్యాలయంలో..

పెదవాల్తేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బంకిం చంద్రచటర్జీ రాసిన 'వందేమాతరం' గీతం స్వాతంత్ర్య పోరాట సమయంలో దేశ ప్రజలందరిలో దేశభక్తిని, స్ఫూర్తిని నింపిందని బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు ఎంఎంఎస్ పరశురామ్‌రాజు పేర్కొన్నారు. నగర బీజేపీ కార్యాలయంలో పరశురామ్‌రాజు అధ్వర్యంలో వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మిడి సుజాతరాజ్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ ఏ.కేశవకాంత్, బీజేపీ శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎస్.విజయానంద రెడ్డి, జిల్లా పదాధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆరిలోవ : తోటగరువు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల వందేమాతర గీతాలాపన

ఆగని ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికుల అవస్థలు

» తగరపువలస, కొమ్మాది, మధురవాడ, మారికవలస, కారుషెడ్డు ప్రాంతాల్లో ఇబ్బందులు
» గంటల కొద్దీ నిరీక్షణతో విద్యార్థుల వెతలు
» పట్టించుకోని అధికారులు



కొమ్మాది జంక్షన్‌లో బస్సుల రాకకోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ద్వారాకా బస్‌స్టేషన్, పాత పోస్టాఫీస్, మద్దిలపాలెం ప్రాంతాల నుంచి తగరపువలస వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రధాన కూడళ్లలో ఆపకపోవడం వల్ల ఈ రూట్‌లలో ప్రయాణించే విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తగరపువలస, కొమ్మాది, మధురవాడ, మారికవలస, కారుషెడ్డు ప్రాంతాల్లో ఎక్కువగా ఇంజనీరింగ్, జూనియర్, ఫార్మశీ, మెడికల్ కళాశాలలు ఉన్నాయి. కళాశాలలకు ఉదయం వెళ్లేందుకు, సాయంత్రం కళాశాలల నుంచి తిరిగి వచ్చేందుకు విద్యార్థులు సంబంధిత బస్టాపుల్లో ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉంటున్నారు. అదే సమయంలో రాకపోకలు సాగించే సాధారణ ప్రయాణికులు కూడా ఉంటున్నారు. కొమ్మాది, మధురవాడ, మారికవలస, కార్‌షెడ్డు జంక్షన్‌లలో ఎక్కువ మంది విద్యార్థులు సాధారణ ప్రయాణికులు ఉంటున్నారు. విశాఖ నుంచి తగరపువలస, తగరపువలస వైపు నుంచి విశాఖ ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. కానీ ఈ బస్టాపుల్లో చాలా బస్సులు ఆపడం లేదు. ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఈ బస్టాపుల్లో ఆపాలి. ఆర్టీసీ రూట్ షెడ్యూల్‌లో అధికారులు దీన్ని స్పష్టంగా పేర్కొన్నారు. అయినా కొన్ని బస్సుల డ్రైవర్లు ఈ నిబంధన పట్టించుకోవడం లేదు. స్టూడెంట్ పాస్‌లు ఉన్న విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, వృద్ధులు బస్టాపుల్లో ఎండలో గంటల కొద్దీ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది.

బస్టాపుల్లో కంట్రోలర్లను ఏర్పాటు చేస్తాం

- బి.అప్పలనాయుడు, ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్



ఈ సమస్య ఇటీవల మా దృష్టికి వచ్చింది. ఈ రూట్‌లో తిరిగే కొన్ని బస్సులు కొమ్మాది, మధురవాడ, మారికవలస, కార్‌షెడ్డు బస్టాపుల్లో ఆపడం లేదని ఫిర్యాదులు అందాయి. దీనిపై సంబంధిత డిపో మేనేజర్లతో మాట్లాడాం. అప్పటికే కెపాసిటీకి మించిన ప్రయాణికులు బస్సులో ఉండడం వల్ల బస్సులు ఆపలేదని డ్రైవర్ల నుంచి వివరణ వచ్చింది. ఆ రూట్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో మరో నాలుగు బస్సులు అదనంగా నడుపుతాం. రెండు, మూడు రోజుల్లో ఈ నాలుగు బస్టాపుల్లోనూ కంట్రోలర్స్‌ను నియమిస్తాం. అన్ని బస్సులు ఆపేలా చర్యలు తీసుకుంటాం.

నిర్మాణాల కోసం చెట్ల నరికివేత

» యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన » పట్టించుకోని అధికారులు



నిర్మాణానికి అడ్డుగా ఉందని నరికివేతకు గురైన చెట్టు

ఆరిలోవచ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల చిన గదిలి కూడలి వద్ద ఓ ప్రైవేటు భవన నిర్మాణం కోసం భారీ వృక్షాన్ని నరికేశారు. సుమారు 15 సంవత్సరాలు ఈ చెట్టు ఈ ప్రాంతంలో నీడను అందించింది. ఈ ప్రాంతంలో ప్రైవేటు భవనాలు చేపడుతున్న పలువురు తమ అవసరాలకు అనుగుణంగా చెట్లను నరికివేయడం పరిపాటిగా మారిందని స్థానికులు మండిపడుతున్నారు. జీవీఎంసీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఏటా లక్షలాది రూపాయలు వెచ్చించి మొక్కలు వేయడం, పర్యావరణ పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతోనే జీవీఎంసీ సరిపెడుతోందని, కానీ ఆచరణలో చూపడం లేదన్న వాదనకు ఈ చెట్టు నరికివేతే నిదర్శనమని విమర్శిస్తున్నారు. ఇలా చెట్లను నరికి వేసే వారికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక జీవీఎంసీ, సచివాలయాల సిబ్బంది లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయంటూ ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చెట్ల అక్రమ నరికివేతను నియంత్రించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే వెలగపూడి దంపతులకు సత్కారం

» వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన తెలుగుమహిళలు



ఎమ్మెల్యే వెలగపూడి దంపతులకు సత్కరిస్తున్న తెలుగు మహిళలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు దంపతులను ఎంవీపీ కాలనీలోని వారి నివాసంలో తెలుగు మహిళలు శుక్రవారం ఘనంగా సత్కరించారు. గడచిన రెండు దశాబ్దాలుగా తమ ప్రాంత సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్న వెలగపూడిని కొనియాడారు. శుక్రవారం వెలగపూడి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేజెళ్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో మహిళలు ఉష, సత్య, సుధ, మంగ, లక్ష్మి, ప్రభ, లీల, నీలపు లక్ష్మి, నాయకులు మోహిత్ వర్మ, వెంపాడ శ్రీనివాసరెడ్డి, మద్ది మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, సుజన దంపతుల పెళ్లి రోజు వేడుకలు కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ నిర్వహిస్తున్న అయ్యప్ప మాలదారులకు నిత్యాన్నదానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దంపతులు చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర, గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 22 వినతులు

వెంకోజీపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 22 వినతులు వచ్చాయని చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు. అధికారులు స్వీకరించిన వినతి పత్రాలను సత్వరమే నిర్ణీత సమయంలో పరిష్కరించే చర్యలు చేపట్టాలని సీసీపీ ఆదేశించారు.

మెట్రో రైలు పనులకు సమగ్ర నివేదిక

» ఢిల్లీ సదస్సుల్లో వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



సదస్సులో పాల్గొన్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఏడీసీ రమేశ్

సిరిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో చేపట్టనున్న మెట్రో రైలు ప్రాజెక్టు పనులకు సంబంధించి సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నామని వీఎంఆర్‌డీ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, అదనపు కమిషనర్ రమేశ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గృహ, పట్టణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలో ప్రారంభమైన 18వ అర్బన్ మొబిలిటీ ఇండియా కాన్ఫరెన్స్ అండ్ ఎక్స్-2025' సదస్సులో పాల్గొన్న వారు వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో విశాఖ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. పట్టణాభివృద్ధి సదుపాయాల కల్పన, ఇతర అంశాలపై సదస్సుకు హాజరైన ప్రతినిధులకు వివరించారు. మెట్రో రైలు పనుల్లో భాగంగా నగర పరిధిలో రవాణా సదుపాయం మెరుగుపరిచేందుకు చేపడుతున్న ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై కేంద్ర మంత్రి మనోహర్ లాల్‌కు వివరించారు. జాతీయ స దస్సుల్లో భాగంగా వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న మెట్రో రైలు ప్రాజెక్టులపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను సందర్శించి, ఆయా రాష్ట్రాల ప్రతినిధుల నుంచి పలు వివరాలను సేకరించారు.

ఎమ్మెల్యే వెలగపూడి కార్యాలయంలో ప్రజా దర్బార్



ఎమ్మెల్యే వెలగపూడిని కలిసి గోడు వెళ్లబోసుకుంటున్న స్విమ్మర్లు

ఎంవీపీ కాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహణలో భాగంగా ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్వీకరించారు. పలువురు 22ఎ భూముల సమస్యలపై వినతులు సమర్పించారు.

అలాగే జీవీఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక సందర్భాల్లో సముద్ర తీరంలో విధులు నిర్వహిస్తున్న స్విమ్మర్లు తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. తమకు ప్రభుత్వపరంగా ఎలాంటి రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

వైద్య రంగంలో పీపీపీ విధానం తగదు : ఏఐడీఎస్వో



ధర్నా నిర్వహిస్తున్న ఏఐడీఎస్వో నేతలు, కార్యకర్తలు

సిరిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేలా కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్వో) ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐడీఎస్వో జిల్లా అధ్యక్షుడు కె.అభిలాష్ మాట్లాడుతూ ప్రజాధనంతో నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం సరైన విధానం కాదన్నారు. వైద్య విద్య ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళితే అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని, వైద్య కళాశాలలు వ్యాపార కేంద్రాలుగా మారిపోతాయన్నారు. పీపీపీ విధానం పేరిట రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో పేదలకు మెరుగైన వైద్యం అందే పరిస్థితి ఉండదని, అందువల్ల మెడికల్ కాలేజీలను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు సంతోష్, ఇతర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **ది గర్ల్ ఫ్రండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి).
● **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
● **జటాధర** : శారదా, శ్రీకన్య
● **బ్యాడ్ ల్యాండ్స్ / ఫెనిక్స్** : రమాదేవి
● **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
● **క్రాంప్** : వెంకటేశ్వర-1,

ఘనంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు జన్మదిన వేడుకలు



వాల్తేరు డిపోలో కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేస్తున్న శివాజీ, వసంతరావు

పెదవాల్తేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ వాల్తేరు డిపో కమిటీ అధ్వర్యంలో ఎన్ఎంయూ విశాఖ జిల్లా గౌరవాధ్యక్షుడు, శాసనసభలో బీజేపీ పక్షనేత, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు జన్మదిన వేడుకలను శుక్రవారం వాల్తేరు డిపోలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్యదర్శి ఏకే శివాజీ పాల్గొని కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాల్తేరు డిపో కార్యదర్శి ఆర్.వసంత రావు, రాష్ట్ర నాయకులు పీజీ పతి, వాల్తేరు డిపో అధ్యక్షుడు ఎస్ఎం నాయుడు, గ్యారేజ్ ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టి సారించాలి

» ఉత్తరాంధ్ర సాధన సమితి ఆధ్వర్యంలో ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న యూఎస్ఎస్ ప్రతినిధులు

సిరిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర సాధన సమితి (యూఎస్ఎస్) ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఉత్తరాంధ్రపై వలసవాదుల పెత్తనం మాకొద్దని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూఎస్ఎస్ వ్యవస్థాపక కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఉత్తరాంధ్ర వెనుకబడి పోతోందన్నారు. అపారమైన వనరులు ఉన్నప్పటికీ, వాటిని వలస వాదులు దోచుకుపోతున్నారన్నారు. 350 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉన్న ఉత్తరాంధ్ర జిల్లాలో ఆశించిన స్థాయిలో ప్రాజెక్టుల స్థాపన జరగటం లేదన్నారు. ఈ ప్రాంత యువత ఉపాధి కోసమని ఇతర రాష్ట్రాలకు వలసపోవాల్సిన దుస్థితి ఉందన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, దీనివల్ల ఉత్తరాంధ్రకు మరింత అన్యాయం జరగబోతుందన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుకు కారణమైన వలసవాదుల పెత్తనం నిలువరించేలా అన్ని వర్గాల వారు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎస్ నేతలు తిరుపతిరావు, రవికుమార్, ఆర్.అప్పలనాయుడు, నారాయణరావు పాల్గొన్నారు.

13వ వార్డు టీడీపీ నూతన కార్యవర్గం



కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డు టీడీపీ నూతన కార్యవర్గం ఎన్నికకు శుక్రవారం ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా ఏడువాక సన్యాసిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా తురకపూడి బాలస్వామి, ఉపాధ్యక్షులుగా మారిక జగన్నాథరావు, కిల్లంశెట్టి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా సోనాపురం సుధాకర్, గుంజ శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శిలుగా వారనాసి అప్పారావు, అధికార ప్రతినిధిగా పి.రాధమ్మ, కార్యవర్గ సభ్యులుగా ఓసెట్టి పైడిరాజు, నేతల త్రినాథరావు, వై.సూరిబాబు, ఆర్.వెంకటరావు, కె.వెంకటేష్, చింతలపూడి నాగేశ్వరరావు, ప్రశాంత్, నరేష్, దేవర శ్రీనివాసరావు, ఎస్‌కె సేథ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు నూతన కమిటీని అభినందించారు. అంతా కష్టపడి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 26, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 62, బెండకాయలు 48, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 50, బీరకాయలు 54, ఆనపకాయ 34, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 58, దొండకాయలు 42, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 64, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 30, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద 46, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

చండికాదేవి ఆలయంలో సుందర కాండ పారాయణం



అలంకరణలో అమ్మవారు

ఎంవీపీ కాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ నాలుగో సెక్టరులోని శ్రీమాత చండికాదేవి ఆలయం ఆవరణలో శుక్రవారం సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా నిర్వహించారు. భక్తులు సామూహికంగా ఆలపించారు. సంప్రదాయ రీతిలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఆలయ కమిటీ మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసింది.

పరీక్ష కేంద్రాలు తనిఖీ

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీజీ సెమిస్టర్ పరీక్షలను స్క్వాడ్ సభ్యులు ప్రొఫెసర్ పీవీ లక్ష్మీనారాయణ, డాక్టర్ కేవీ రమణమూర్తి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాజువాక ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎనిమిది మంది విద్యార్థులు, గాజువాక చైతన్య డిగ్రీ, పీజీ ఉమెన్స్ కళాశాలలో ముగ్గురు, ద్వారకానగర్ ప్రిజమ్ డిగ్రీ, పీజీ కళాశాలలో ముగ్గురు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్నట్టు గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని పరీక్షల విభాగాధికారులకు సూచించారు.

బిల్లులు చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్టర్ల ధర్నా



ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్టర్లు

సిరిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టర్లు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు జీవీఎంసీ పరిధిలోని కాంట్రాక్టర్లు ధర్నాలో పాల్గొన్నారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పీవీవీ నాగరాజు, ఎం.సంజీవరెడ్డి మాట్లాడుతూ గత 13 నెలలుగా రూ.400 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎస్‌డీఎఫ్, జీజీఎంపీ బిల్లులు ఆరేళ్లుగా చెల్లించడం లేదన్నారు. ఈఎండీ, ఎఫ్ఎస్‌డీ, ఏఎస్‌డీ డిపాజిట్లు రెండేళ్ల కాల వ్యవధి అయిన వెంటనే తిరిగి వచ్చేలా సాఫ్ట్‌వేర్ రూపొందించాలన్నారు. పద్ధతి ప్రకారం బిల్లులు చెల్లించాలన్నారు. జీవీఎంసీ బడ్జెట్ ఉన్న పనులకే టెండర్లు పిలవాలని, నిధి పోర్టల్‌లో జీవీఎంసీకి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ధర్నాలో ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.రమేష్, అసోసియేషన్, నాయకులు జి.సింహాచలం, రాజాన వెంకటరమణ, టీ.వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి దేవి అమ్మవారి అదివాస మహోత్సవం రేపు

డాబాగార్డెన్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భువనేశ్వరి దేవి ఆరాధన పీఠం, ఓం భువనేశ్వరి సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యాతపాలెం చెల్లాయమ్మతోటలోని భువనేశ్వరిదేవి అమ్మవారికి 'జిల్లేడు పత్రి'తో ఈ నెల 9న ఆదివాస మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ట్రస్టు నిర్వాహకులు మురళీకృష్ణ తెలిపారు. కృష్ణాగార్డెన్స్ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం పండితులు, పెద్దలతో అమ్మవారికి సుగంధద్రవ్యాలు, దివ్య పంచామృతాలతో మంగళస్నానం చేయిస్తారన్నారు. చీర, జాకెట్టు, రామఫలం, తమలపాకులతో స్వయంగా పూజ చేసుకోవచ్చన్నారు.

300 మందికి ఉచిత వైద్యచికిత్స


చికిత్స చేస్తున్న వైద్యురాలు

అల్లిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 32వ వార్డు నేరళ్లకోనేరు వద్ద శుక్రవారం కేఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ కందుల నాగరాజు ప్రారంభించిన ఈ శిబిరంలో సుమారు 300మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్, కేర్ హాస్పిటల్,పుష్పగిరి ఐ హాస్పిటల్ వైద్య సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుభద్ర, సౌజన్య, పాల్, కో-ఆర్డినేటర్ సీహెచ్ స్వాతిశ్రీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

16న విద్యార్థులకు భగవద్గీత పఠన పోటీలు

డాబాగార్డెన్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకొని ఈ నెల 16న ఉదయం 9 గంటలకు గీతా భవనంలో భగవద్గీతలోని 15వ అధ్యాయంపై మౌఖిక పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు తెలిపారు. 5 నుంచి 8 ఏళ్ల వరకు ప్రథమ, 9 నుంచి 12 వరకు ద్వితీయ, 13 నుంచి 20 వరకు తృతీయ, 21, ఆపై వయసు వారిని చతుర్థవర్గానికి అర్హులుగా పరిగణించనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు ఈ నెల 10లోగా సంస్థ కార్యదర్శి ఎం.వనజాదేవిని ఫోన్ (70326 62344)లో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా సారె మహోత్సవం

జ్ఞానాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గౌరీపరమేశ్వరుల లీలా మహోత్సవాల్లో భాగంగా అల్లిపురం వెంకటేశ్వరమెట్ట వద్ద గౌరీ సేవాసంఘం, వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో శుక్రవారం కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పది వీధులకు చెందిన వందలాది మంది మహిళలు మిఠాయిలు, పండ్లతో పురవీధుల్లో ఊరేగించి వైభవోపేతంగా సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెండింగ్ చలానాల తనిఖీ

మాధవధార, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి పర్యవేక్షణలో శుక్రవారం ఆర్అండ్‌బీ జంక్షన్‌లో పోలీసు సిబ్బంది వాహనాల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పెండింగ్ చలానాలు, హెల్మెట్ లేకుండా వెళ్లడం సహా సిగ్నల్ జంప్, అధిక లోడుతో వెళ్లే ఆటోలు, సీట్ బెల్టు లేని కార్ల డ్రైవింగ్‌పై దృష్టి సారించారు. చలానా రుసుము చెల్లించకపోతే లైసెన్సు రద్దయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అపరాధ రుసుము వసూలు చేసి వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు.

పెట్రోల్ దొంగతనాల జోరు

మహారాణిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ దొంగలతో స్థానికులు అల్లాడిపోతున్నారు. మహారాణిపేట పోలీసు స్టేషన్ పరిధిలోని అంగటి దిబ్బ, జిల్లా పరిషత్ జంక్షన్, రామజోగిపేట తదితర ప్రాంతాల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అర్ధరాత్రి దాటాక ఇంటి సమీపంలో పార్కింగ్ చేసి పెట్టుకున్న వాహనాలలో పెట్రోల్ చోరీ చేస్తున్నారు. రాత్రి వేళల్లో వాహనం బయట పెట్టాలంటే భయపడుతున్నారు. రెండు, మూడు రోజులుగా పెట్రోల్ దొంగతనాలు జరుగుతుండడంతో బాధితులు మహారాణిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరుల ఆట కట్టించాలని బాధితులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి

దాటుతుండగా అనకాపల్లి నుంచి గాజువాక వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న మునగపాక మండలం చూచుకొండ గ్రామానికి చెందిన సారిక నాగరాజు (48), అతని కుమారుడు జవహర్‌లు ఢీకొట్టారు. దీంతో రమణమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. తీవ్ర గాయాలపాలైన నాగరాజు, జవహర్‌లను కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సారిక నాగరాజు (48) మృతిచెందారు. జవహర్‌కు గాయాలయ్యాయి. డిగ్రీ పూర్తిచేసిన జవహర్ ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. తారక్ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జవహర్ నుంచి ఫిర్యాదు రావాల్సి ఉందని పోలీసులు తెలిపారు.


తూర్పుకోస్తారైల్వే డివిజన్ కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన


ఆంధ్ర వైద్య కళాశాలలో సామూహికంగా ఆలాపన

సామూహికంగా వందేమాతరం గీతాలాపన

విశాఖపట్నం/మహారాణిపేట/సీతమ్మధార నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం వివిధ ప్రాంతాల్లో సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కేజీహెచ్ ప్రధాన పరిపాలనా విభాగం ఎదుట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి వందేమాతర గీతం ప్రాముఖ్యతను వివరించారు. ఆంధ్ర వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, వైద్యసిబ్బంది, ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు గీతాలాపన చేశారు. వాల్తేరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు గీతాన్ని సామూహికంగా ఆలపించారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ జాతీయ గీతం మనదేశ ఐక్యత, భక్తి, ఆత్మ గౌరవ స్ఫూర్తికి చిహ్నంగా నిలిచిందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన ఈ గీతం ప్రతి ఒక్కరిలో ఐక్యతను నింపిందన్నారు. ఈ వేడుకలను డివిజన్ వ్యాప్తంగా అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో నిర్వహించామన్నారు. తూర్పుకోస్తారైల్వే డివిజన్ కన్‌స్ట్రక్షన్స్ కార్యాలయంలోనూ వందేమాతరం వేడుక జరిగింది. చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్త ముఖ్య అతిథిగా హాజరుకాగా, చీఫ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, విష్ణుమూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అంకుష్ గుప్త మాట్లాడుతూ ప్రతి భారతీయుడు గర్వంగా భావించే వందేమాతర గీతం 150 ఏళ్ల వేడుకలు ఘనంగా జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ఐక్యత, దేశభక్తి, సామరస్యతను చాటే ఈ గీతం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ మొల్లి శోభ పర్యవేక్షణలో సీతమ్మధార రైతుబజార్‌లో ఎస్టేట్ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి అధ్యక్షతన రైతులు, మార్కెటింగ్ కమిటీ ప్రతినిధులు, వందేమాతరం గీతాలాపన చేశారు.

పతకాలు తెచ్చేలా నైపుణ్యం చూపండి: ఎమ్మెల్యే గణబాబు


వాలీబాల్ క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న గణబాబు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11 నుంచి ఉత్తరప్రదేశ్‌లోని బరేలిలో జరగనున్న జాతీయ వాలీబాల్ టోర్నీలో ప్రతిభా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రానికి పతకాలు తేవాలని పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ఆకాంక్షించారు. గతంలో రాణించినవారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పోర్టు స్టేడియంలోని శాయ్ శిక్షణ కేంద్రంలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ అండర్-17 బాలురు, బాలికల చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్ల శిబిరానికి శుక్రవారం సాయంత్రం ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు సామగ్రిని పంపిణీ చేశారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి టోర్నీలో విశాఖ వాలీబాలర్లు అద్భుతంగా రాణించి జాతీయ పోటీలకు ఎంపిక కావడం ఆనందదాయకమన్నారు. స్కూల్ గేమ్స్ టోర్నీల ద్వారా అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి సత్యనారాయణ, కోచ్ సూరిబాబు, ఎస్‌జీఎఫ్ కోచ్ సురేష్, జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధులు మోహనబాబు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుడి సన్నిధిలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు


ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు ఆదిత్యుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్

అరసవల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లిలో ఆదిత్యుడ్ని విశాఖపట్నం నార్త్‌జోన్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు(బీజేపీ) కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ వారికి అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి రంజిత్‌శర్మ, దర్భముళ్ల శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణ కోసం 10న సత్యాగ్రహం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలుగు దండు ప్రతినిధులు

సీతంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ దొర జయంతిని పురస్కరించుకొని ఈ నెల 10న సెంట్రల్ పార్కు సమీపంలోని గాంధీ పార్కులో సత్యాగ్రహం నిర్వహిస్తున్నట్టు తెలుగుదండు వ్యవస్థాపక అధ్యక్షుడు పరవస్తు సూరి తెలిపారు. గురుద్వార కూడలి శాంతిపురంలోని తెలుగు దండు కార్యాలయంలో శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను పలువురు ప్రముఖులతో కలిసి ఆవిష్కరించారు. వైసీపీ ప్రభుత్వం తెలుగు భాషకు చేసిన అన్యాయం వల్ల రెండు, మూడు తరాల బిడ్డలు మన భాషకు దూరమయ్యారని సూరి ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం కూడా ఇంతవరకు అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. తెలుగు భాషా వైభవం నేతల ప్రసంగాల్లో తప్ప చేతల్లో శూన్యంగా కనిపిస్తోందన్నారు. మాతృభాష వ్యతిరేక చర్యలను ప్రశ్నించాలనే ఉద్దేశంతో ఈ నెల 10న సత్యాగ్రహంలో కూర్చుంటామన్నారు. ఇందులో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలుగు భాష పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రజా ఉద్యమమే తెలుగుదండుగా వక్తలు పేర్కొన్నారు. అధికార భాషా సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, అన్ని బడులలో ప్రాథమిక విద్యాబోధన తెలుగులోనే జరగాలని, ఆంగ్లాన్ని ఒక పాఠ్యాంశంగా బోధించాలని, గత ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన వ్యాజ్యాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్ డి.వి.సూర్యారావు, అడపా రామకృష్ణ, డాక్టర్ కొచ్చెర్లకోట, చిన సూర్యనారాయణ, ప్రజాకవి దేవిశ్రీ, నాంచారయ్య, తెలుగుదండు పాఠకులు శ్రీధర్, సురేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి జిల్లా సివిల్ సర్వీసు క్రీడా జట్ల ఎంపిక

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసు ఉద్యోగుల క్రీడా పోటీల్లో పాల్గొనే జిల్లా పురుషులు, మహిళల జట్ల ఎంపికలు ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి జూన్ గ్యాలియట్ తెలిపారు. ఏయూ జిమ్నాజియం ఇండోర్ హాలులో పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్; బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్సులో స్విమ్మింగ్; ఆఫీసర్స్ క్లబ్‌లో టెన్నిస్ ఎంపికలు జరుగుతాయన్నారు. 12న గోపాలపట్నం ఇండోర్ స్పోర్ట్స్ హాల్లో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్యారమ్, చెస్ ఎంపికలు, 13న కొమ్మాదిలోని శాప్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సులో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, హాకీ, కబడ్డీ, వాలీబాల్, యోగా, రెజ్లింగ్, మ్యూజిక్ అండ్ డ్యాన్స్, షార్ట్ ప్లే ఈవెంట్లలో ఎంపికలు జరుగుతాయని వివరించారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19 నుంచి 22 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని, వివరాలకు క్రీడా ప్రాధికార సంస్థ ఫోన్:83094 17921లో సంప్రదించాలన్నారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌పై విజయం సాధ్యమే

- ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి

మహారాణిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్క్రీనింగ్ చేయడం ద్వారా క్యాన్సర్‌పై విజయం సాధించవచ్చని ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి అన్నారు. శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా కేజీహెచ్ పరిపాలనా విభాగం కార్యాలయం ఎదుట వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంధ్యాదేవి మాట్లాడుతూ జీవన ప్రమాణాలు పెరగటం, జీవన శైలిలో మార్పులు రావటంతో అసంక్రమిత, దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అధిక రక్తపోటు (బీపీ), చక్కెర (సుగర్), క్యాన్సర్ వ్యాధులు గణనీయంగా పెరుగుతున్నాయని తెలిపారు రాష్ట్రంలో హెచ్చుసంఖ్యలో క్యాన్సర్ కేసులు నమోదవుతుండగా, వీటిలో చాలావరకు ఆలస్యంగా గుర్తిస్తున్నారని, నయం చేయలేని పరిస్థితులలో అధిక మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకుని, క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముందుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయగల వ్యాధి క్యాన్సర్ అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఉచితంగా నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై స్క్రీనింగ్ సదుపాయం కల్పిస్తోందని తెలిపారు. ఈ పరీక్షల కోసం ఇంటి వద్దకు వచ్చే ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని సంధ్యాదేవి కోరారు. ఆరోగ్య కేంద్రాల్లోనూ ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని, వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి. జగదీశ్వరరావు, డాక్టర్ శిల్ప, డాక్టర్ సాయి సుష్మా, డాక్టర్ హారిక, వైద్యాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు

'ఆధ్యాత్మిక స్ఫూర్తి ప్రదాత పార్వతీకుమార్'


మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీలో పాల్గొన్న అతిథులు

అక్కయ్యపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భౌగోళికంగా ఆధ్యాత్మిక, సామాజిక రంగాల ద్వారా మాస్టర్ కె.పార్వతీకుమార్ అందించిన సేవలు నిరుపమానమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ కొనియాడారు. మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ ప్రాంగణంలో జగద్గురు పీఠం సోదరబృందం నిర్వహించిన మాస్టర్ పార్వతీకుమార్ 81వ జయంతి ఉత్సవం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య స్థాపించిన ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ భౌగోళిక అధ్యక్షునిగా ఆయన దేశ, విదేశాల్లో విశేషమైన ఆధ్యాత్మిక కృషి చేశారని తెలిపారు. పార్వతీకుమార్ రెండు వందలకు పైగా తెలుగు, ఆంగ్ల పుస్తకాలు రచించారని, కొన్ని జర్మన్, స్పానిష్ భాషలలోకి అనువదించారన్నారు. సంస్కృతి సదన్‌లో టైలరింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన 20 మంది మహిళలకు ధ్రువపత్రాలు, పది మందికి కుట్టు మిషన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ హోమియో వైద్యాలయ నిర్వాహకురాలు డాక్టర్ అజ్జరపు సుబ్బలక్ష్మి, కేఎల్ నరసింహం, మామిడన్న శ్రీనివాస్, ఎస్వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి నైపుణ్య పోటీలు

మహారాణిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి నైపుణ్య పోటీలు నిర్వహించారు. విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ బి.విజయభాస్కర్, సమగ్రశిక్షా కో-ఆర్డినేటర్ డా చంద్రశేఖర్‌రావులు ముఖ్య అతిథులుగా విచ్చేసి పోటీలు ప్రారంభించారు. ఇందులో 28 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల నుంచి 10 రకాల వృత్తి విద్యా విభాగాల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొని 96 ప్రాజెక్టులను ప్రదర్శించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచినవారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 బృందాలను సమగ్రశిక్షా రాష్ట్ర కార్యాలయం నిర్వహించే పోటీలకు పంపిస్తామన్నారు. ఈ సమావేశంలో అధికారులు జి.శ్రీదేవి, సోమేశ్వరరావు, 46 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


బహుమతులు పొందిన విద్యార్థులతో సహకారబ్యాంకు సిబ్బంది

కంచరపాలెం: అంతర్జాతీయ సహకార దినోత్సవం నేపథ్యంలో విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు కంచరపాలెం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. స్థానిక ఊర్వశి జంక్షన్ సమీపంలోని రైట్ వే స్కూల్లో విద్యార్థులకు సహకార సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాచరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరిచినవారికి జ్ఞాపికలు, బహుమతులు ప్రదానం చేశారు. బ్యాంకు అధికారులు యు.పార్వతీదేవి, ఎంవీ గణేష్, డి.పావని, పి.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సుదర్శన్ పాల్గొన్నారు.

ఘనంగా హాకీ క్రీడ శతాబ్ది వేడుకలు


ధ్యాన్‌చంద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హాకీ క్రీడాకారులు, అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖలో హాకీ క్రీడ శతాబ్ది వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి హాకీ విశాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేఈఈ అప్పారావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆంజనేయరావు, భవానీప్రసాద్, అంబు, రాంజీ, సీనియర్ హాకీ క్రీడాకారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ భారత క్రీడారంగానికి ప్రపంచ వ్యాప్తంగా విశేష ఖ్యాతి తెచ్చిన తొలి క్రీడాంశంగా హాకీకి ప్రత్యేక స్థానముందన్నారు. దేశానికి అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులను అందించిన ఘనత విశాఖకు దక్కుతుందన్నారు. హాకీ క్రీడకు అవసరమైన ఆస్ట్రో టర్ఫ్ మైదానాన్ని ఏర్పాటు చేయాలని దీర్ఘకాలంగా కోరుతున్నా కార్యరూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు ఇందుకు చొరవ చూపాలని కోరారు. విశాఖ నుంచి అంతర్జాతీయ, జాతీయ స్థాయి టోర్నీలలో పాల్గొన్న హాకీ పూర్వ క్రీడాకారులు గోపాలకృష్ణ, అంబు, గోపి, జూన్ గ్యాలియట్, అబ్దుల్, చిల్లీ, స్టాన్లీ, మూర్తి, శ్రీనివాస్, నెల్సన్ పీటర్, శివ, మోహన, దుర్గా, మాధవిలను ఘనంగా సత్కరించారు. అనంతరం ధ్యాన్‌చంద్ విగ్రహం నుంచి ఆర్‌కె బీచ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి హాకీ క్రీడ ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఏయూ గ్రౌండ్‌లో జరిగిన వందేమాతరం గీతం వందేళ్ల కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ ఉపకులపతి ఆచార్య రాజశేఖర్...హాకీ శతాబ్ది వేడుకలకు ఊహించని అతిథిగా పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

కేజీహెచ్‌లో మహిళ మృతి

- ఆక్సిజన్, విద్యుత్ సరఫరా లేకనే: బంధువులు
- మద్యం అలవాటుతోనే మరణం: కేజీహెచ్ సూపరింటెండెంట్

మహారాణిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో గురువారం రాత్రి సుమారు 11 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన కారణంగా మహిళ మృతి చెందినట్లు ఆమె బంధువులు ఆరోపించారు. తెలంగాణలోని దోమకొండ ప్రాంతానికి చెందిన వి.దేవి మద్రిపాలెంలో బంధువుల ఇంటికి వచ్చి అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చేరింది. ఆ సమయంలో తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు ఉండేవి. వైద్య పరీక్షల అనంతరం ఆమెకు అత్యవసర చికిత్స అందించారు. పరిస్థితి మెరుగుపడటంతో సాధారణ వార్డుకు తరలించారు. ఈ క్రమంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఆమె పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ఘటనపై ఆమె సోదరి మాట్లాడుతూ ఆక్సిజన్ అందకపోవటం, విద్యుత్ సరఫరా లేకపోవటమే మృతికి కారణమని ఆరోపించింది. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి వివరణ ఇస్తూ.. ఆక్సిజన్, రక్తపోటు నార్మల్‌గా ఉండడంతో సాధారణ వార్డుకు తరలించామన్నారు. రాత్రి సమయంలో ఆమె ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా మారిపోవడంతో వైద్య పరీక్షలు నిర్వహించామని, హఠాత్తుగా గుండెపోటు రావటంతో మృతి చెందిందన్నారు. దేవికి మద్యం తాగే అలవాటు ఉండడంతో కాలేయ సమస్య వచ్చిందని, అది కూడా ఆమె మృతికి ఒక కారణంగా సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

కేజీహెచ్‌కు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

... 5వ పేజీ తరువాయి

ఉన్నతాధికారులు పట్టనట్టు వ్యవహరించడం వల్లే రోగులు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చిందంటున్నారు. ఈ సమస్యకు సంబంధించిన వీడియో సోషల్ మీడియోలో వైరల్‌గా మారిన తరువాత ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు తలంటిన తరువాతే ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఆస్పత్రి అధికారులకు సమాచారాన్ని అందించినట్టు చెబుతున్నారు. అప్పటివరకూ ఆస్పత్రిలో ఉన్న ఎలక్ట్రికల్ సిబ్బందితోనే సమస్యను పరిష్కరించే ప్రయత్నాలు చేశారు. అదే సమస్య ఉత్పన్నమైన వెంటనే ఆస్పత్రి అధికారులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి ఉంటే సాయంత్రానికి పరిష్కారమయ్యేదని చెబుతున్నారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణిని వివరణ కోరగా తాను కోర్టు పనులు నిమిత్తం విజయవాడ వెళ్లానన్నారు. అయినప్పటికీ సమస్య తెలిసిన వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరించే ప్రయత్నం చేసినట్టు తెలిపారు. నేరుగా విజయవాడ నుంచి ఆస్పత్రికే వచ్చి పనులను పర్యవేక్షించానని, అప్పటికే డిప్యూటీ సూపరింటెండెంట్లు, అడ్మినిస్ట్రేటర్, ఇతర అధికారులు పనులు జరుగుతున్న ప్రాంతంలోనే ఉన్నారన్నారు. ఇదిలావుండగా ఆస్పత్రిలో నిర్వహణ పనుల కారణంగా తలెత్తిన సమస్యను సిబ్బందితో కలిసి పరిష్కరించి రాత్రి 11.45 గంటలు సమయంలో సరఫరా పునరుద్ధరించామని ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ జి.శ్యాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

డిగ్రీ పూర్తికి మరో అవకాశం

... 5వ పేజీ తరువాయి

రూ.లక్షకుపైగా చెల్లించాల్సి ఉంటుంది. అందుకే పెద్దగా ఎవరూ ముందుకురాలేదు. ఈ నేపథ్యంలో నామమాత్రపు ఫీజు చెల్లించి ఒకేసారి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు రాసుకునేందుకు అవకాశం కల్పించాలని తాజాగా వర్సిటీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కొద్దిరోజుల్లో షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ తెలిపారు. ఇది వందలాది మంది విద్యార్థులకు మేలు చేస్తుందన్నారు. ఇప్పుడు డిగ్రీ విద్యార్థులు చెల్లిస్తున్న ఫీజునే వసూలు చేయనున్నారు.

తత్కాల్ ఫీజు రద్దు

వర్సిటీ అధికారులు మరో కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. వివిధ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అత్యవసరంగా కావాలంటే ప్రస్తుతం నిర్ణీత రుసుము కంటే కొంచెం ఎక్కువ మొత్తం (తత్కాల్ పద్ధతి) వసూలు చేస్తున్నారు. తత్కాల్ విధానంలో సర్టిఫికెట్లను ఒకటి, రెండు రోజుల్లో ఇస్తున్నారు. అయితే, తత్కాల్ ఫీజు విద్యార్థులకు భారంగా మారుతుందని గ్రహించిన అధికారులు దానిని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులకు నిజంగానే అత్యవసరంగా సర్టిఫికెట్లు కావాల్సి వస్తే...తత్కాల్ విధానంలో ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఒకరోజులో ఇచ్చేలా చర్యలు చేపడుతున్నారు. దీనికి సంబంధించి ఆదేశాలను ఇప్పటికే ఎగ్జామినేషన్ విభాగానికి ఇచ్చినట్టు వైస్ చాన్సలర్ వెల్లడించారు.

అమ్మవారి సన్నిధిలో కొత్త సంప్రదాయాలేల?

... 5వ పేజీ తరువాయి

వేస్తున్నామని ఈఓ శోభారాణి సమాధానం ఇవ్వగా, దానిని స్థానికులు ఖండించారు. రాత్రిపూట వెండి తాపడం తీసేస్తున్నారని స్పష్టంచేశారు.

తెల్లవారుజామున 5-6 గంటల మధ్య పూజారులు వచ్చి పూజలు చేశాకే ఇతరులను అమ్మవారి సన్నిధికి అనుమతించే సంప్రదాయం ఈవో తీసుకువచ్చారని ఫిర్యాదు చేశారు. అమ్మవారి దర్శనాలకు ఇలాంటి నిబంధనలు గతంలో ఎన్నడూ లేవన్నారు. అయ్యప్పస్వాములు తెల్లవారు జామున నాలుగు గంటలకు వస్తే వారిని మండపం దాటి ముందుకు వెళ్లనివ్వడం లేదని స్థానిక కార్పొరేటర్ దంపతులు ఫిర్యాదు చేశారు. అమ్మవారిపై పాలు, పెరుగు, కొబ్బరికాయల నీళ్లు నేరుగా వేసేవారమని, ఇప్పుడు ప్రత్యేక పాత్రలు పెట్టి...వాటిలో పోయమంటున్నారని, అవన్నీ నిండాక అమ్మవారి తలపై జల్లెడ పెట్టి అందులో పోస్తున్నారని వారంతా ఎమ్మెల్యేకు వివరించారు. ఈ ఆలయంలో భక్తులు ఎవరి పూజ వారు చేసుకునే సంప్రదాయం ఉందని, దానికి ఈఓ శోభారాణి అడ్డంకులు సృష్టిస్తున్నారని, కొత్త పద్ధతులు తొలగించి పాత విధానాల ప్రకారమే అన్నీ జరిగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. అన్నీ విన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్...భక్తుల మనోభావాలు, ఆలయ సంప్రదాయాల ప్రకారం ముందుకు వెళ్లాలని, స్థానికులను ఇబ్బందులకు గురిచేయవద్దని ఈఓకు సూచించారు.

ఉప ఖజానా దొంగలపై కొరడా

... 5వ పేజీ తరువాయి

చేపట్టింది. సుదీర్ఘంగా విచారించి 2021లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అప్పటి నుంచి పలుమార్లు విజిలెన్స్ అధికారులు వార్షిక నివేదికలలో ట్రెజరీ కుంభకోణం విషయాన్ని ప్రస్తావిస్తూ వచ్చారు. చివరకు ఈ ఏడాది ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖను ఆదేశించింది. దీంతో 2011 నుంచి 2017 వరకు జరిగిన పింఛన్ సొమ్ముల స్వాహాకు సంబంధించి అప్పట్లో సీతమ్మధార డివిజనల్ సబ్‌ట్రెజరీలో పనిచేసి ప్రస్తుతం సీనియర్ అకౌంటెంట్లుగా ఉన్న 11 మందిపై చర్యలు తీసుకోవాలని విశాఖలోని ఖజానా కార్యాలయం డీడీని ఖజానా రాష్ట్ర డైరెక్టర్ ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం జిల్లా కార్యాలయంతోపాటు అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్న 11 మందికి ఆయన చార్జిమెమోలు జారీచేశారు. పింఛన్ల సొమ్ము స్వాహాకు సంబంధించిన వ్యవహారంలో ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. చార్జిమెమోలు అందుకున్న వారిలో చినఅప్పలరాజు, శ్రావ్య గోపాల్, హైమా, పైడిరాజు, అశోక్, రాజు ప్రకాశ్, బేబీ చైతన్య, తదితరులు ఉన్నారు. వీరిలో కొందరు కొంత సమయం కావాలని డీడీని కోరారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అర్ధరాత్రి వరకూ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

ఇచ్చింది. వాటికి ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా కన్వేయన్స్ డీడ్స్ ఇస్తోంది. వీఆర్‌ఓల ద్వారా మండలాల తహశీల్దార్లు ఈ రిజిస్ట్రేషన్లను చేయిస్తున్నారు. జిల్లాలో 24 వేల రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 13 వేలు పూర్తయ్యాయి. ఆక్రమితదారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేసిన తరువాత ఆ డాక్యుమెంట్‌ను తహశీల్దార్ సూచించిన వీఆర్‌ఓకే ఇస్తారు. కక్షిదారులకు ఇవ్వరు. అయితే వీఆర్‌ఓలు గ్రామంలో అన్ని రిజిస్ట్రేషన్లు పూర్తయిన తరువాత వచ్చి తీసుకువెళతామంటూ వాటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉంచేస్తున్నారు. ఇవి రెండో రకం పెండింగ్ డాక్యుమెంట్లు. ఇలాంటివి ఒక్కో కార్యాలయంలో 200 వరకూ ఉన్నాయి. వీటిని కూడా ఏసీబీ అధికారులు తప్పుబట్టారు. ఎప్పటికప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని సబ్ రిజిస్ట్రార్లను ప్రశ్నించారు. అందులో తమ జాప్యం లేదని రెవెన్యూ సిబ్బందే చెప్పినట్టు సమాచారం. ఏసీబీ అధికారుల అభ్యంతరం చెప్పిన నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రెవెన్యూ అధికారులకు వాటిని తీసుకువెళ్లాల్సిందిగా శుక్రవారం లేఖలు వెళ్లాయి.

విశాఖలో దొరికింది రూ.10 వేలు మాత్రమే

ఏసీబీ అధికారులు విశాఖ జిల్లాలో మూడు కార్యాలయాల్లో సోదాలు చేస్తే సూపర్‌బజార్ (ఆర్‌వో) కార్యాలయంలో మాత్రమే రూ.10 వేల నగదు ఒక పెళ్లి కార్డు కవరులో దొరికింది. అది ఎవరు తెచ్చారు?, ఎవరికి ఇచ్చారు?...అనే వివరాలు బయటకు రాలేదు. మధురవాడ, పెదగంట్యాడ కార్యాలయాల్లో ఏమీ లభించలేదు. పలువురు డాక్యుమెంట్ రైటర్ల వద్ద నగదు, వారి ఫోన్ల లావాదేవీలను ఏసీబీ అధికారులు పరిశీలించారు. వాటి వివరాలు కూడా నమోదు చేసుకున్నారు.

దేశభక్తి రగిలించిన వందేమాతరం

» డీఐజీ గోపీనాథ్‌రెడ్డి » పలు చోట్ల ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల సంబరాలు



మద్దిలపాలెం : జాతీయ గీతం ఆలపిస్తున్న డీఐజీ గోపీనాథ్ రెడ్డి



పెదవాల్తేర్ : వందేమాతరం గీతాన్ని సామూహికంగా ఆలపిస్తున్న బీజేపీ నేతలు

మద్దిలపాలెం, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది భారతీయుల్లో దేశభక్తి జ్వాలలు రగిలించిన గేయం వందేమాతరమని డీఐజీ గోపినాథ్ జెట్టి పేర్కొన్నారు. విశాఖ రేంజ్ కార్యాలయంలో శుక్రవారం వందేమాతరం 150 ఏళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1875లో బంకించంద్ర చటర్జీ రాసిన వందేమాతరం గేయం తొలిసారిగా ఆనంద్ మఠ్ నవలలో వచ్చిందన్నారు. అప్పటి నుంచి వందేమాతరం గేయం భారతీయుల్లో జాతీయాభిమానానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో కార్యాలయం మేనేజర్ బాలసూర్యారావు, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నూట యాభై ఏళ్ల వందేమాతర గీతాన్ని వేడుకగా విద్యార్థులు ఆలపించి, దేశభక్తిని చాటారు. ఎంవీపీ కాలనీలోని సత్యసాయి విద్యా విహార్‌లో శుక్రవారం గీతాలపన కార్యక్రమాన్ని సంబరంగా నిర్వహించారు. గీతం ప్రాముఖ్యతను తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఉపాధ్యాయులు వివరించారు.

వుడా హెల్త్ ఎరీనాలో ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ ఆధ్వర్యంలో క్రీడాకారులు వందేమాతర గీతాన్ని ఆలపించారు. కేఎస్సార్ అకాడెమీ సభ్యులు పాల్గొన్నారు. ఎంవీపీ కాలనీ రైతు బజార్‌లో రైతులు, సిబ్బంది అందరూ కలసి వందేమాతర గీతాన్ని పాడారు. ఎస్టేట్ అధికారి వరహాలు, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ మొల్లి శోభ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నగర కార్యాలయంలో..

పెదవాల్తేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బంకిం చంద్రచటర్జీ రాసిన 'వందేమాతరం' గీతం స్వాతంత్ర్య పోరాట సమయంలో దేశ ప్రజలందరిలో దేశభక్తిని, స్ఫూర్తిని నింపిందని బీజేపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు ఎంఎంఎస్ పరశురామ్‌రాజు పేర్కొన్నారు. నగర బీజేపీ కార్యాలయంలో పరశురామ్‌రాజు అధ్యర్యంలో వందేమాతరం 150 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మిడి సుజాతరాజ్, బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియో కన్వీనర్ ఏ.కేశవకాంత్, బీజేపీ శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి ఎస్.విజయానంద రెడ్డి, జిల్లా పదాధికారులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆరిలోవ : తోటగరువు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల వందేమాతర గీతాలాపన

ఆగని ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికుల అవస్థలు

» తగరపువలస, కొమ్మాది, మధురవాడ, మారికవలస, కారుషెడ్డు ప్రాంతాల్లో ఇబ్బందులు
» గంటల కొద్దీ నిరీక్షణతో విద్యార్థుల వెతలు
» పట్టించుకోని అధికారులు



కొమ్మాది జంక్షన్‌లో బస్సుల రాకకోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

ద్వారకాబస్‌స్టేషన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ద్వారాకా బస్‌స్టేషన్, పాత పోస్టాఫీస్, మద్దిలపాలెం ప్రాంతాల నుంచి తగరపువలస వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు ప్రధాన కూడళ్లలో ఆపకపోవడం వల్ల ఈ రూట్‌లలో ప్రయాణించే విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తగరపువలస, కొమ్మాది, మధురవాడ, మారికవలస, కారుషెడ్డు ప్రాంతాల్లో ఎక్కువగా ఇంజనీరింగ్, జూనియర్, ఫార్మశీ, మెడికల్ కళాశాలలు ఉన్నాయి. కళాశాలలకు ఉదయం వెళ్లేందుకు, సాయంత్రం కళాశాలల నుంచి తిరిగి వచ్చేందుకు విద్యార్థులు సంబంధిత బస్టాపుల్లో ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉంటున్నారు. అదే సమయంలో రాకపోకలు సాగించే సాధారణ ప్రయాణికులు కూడా ఉంటున్నారు. కొమ్మాది, మధురవాడ, మారికవలస, కారోషెడ్డు జంక్షన్‌లలో ఎక్కువ మంది విద్యార్థులు సాధారణ ప్రయాణికులు ఉంటున్నారు. విశాఖ నుంచి తగరపువలస, తగరపువలస వైపు నుంచి విశాఖ ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. కానీ ఈ బస్టాపుల్లో చాలా బస్సులు ఆపడం లేదు. ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఈ బస్టాపుల్లో ఆపాలి. ఆర్టీసీ రూట్ షెడ్యూల్‌లో అధికారులు దీన్ని స్పష్టంగా పేర్కొన్నారు. అయినా కొన్ని బస్సుల డ్రైవర్లు ఈ నిబంధన పట్టించుకోవడం లేదు. స్టూడెంట్ పాస్‌లు ఉన్న విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు, వృద్దులు బస్టాపుల్లో ఎండలో గంటల కొద్దీ బస్సుల కోసం నిరీక్షించాల్సి వస్తోంది.

బస్టాపుల్లో కంట్రోలర్లను ఏర్పాటు చేస్తాం

- బి.అప్పలనాయుడు, ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్



ఈ సమస్య ఇటీవల మా దృష్టికి వచ్చింది. ఈ రూట్‌లో తిరిగే కొన్ని బస్సులు కొమ్మాది, మధురవాడ, మారికవలస, కార్‌షెడ్డు బస్టాపుల్లో ఆపడం లేదని ఫిర్యాదులు అందాయి. దీనిపై సంబంధిత డిపో మేనేజర్లతో మాట్లాడాం. అప్పటికే కెపాసిటీకి మించిన ప్రయాణికులు బస్సులో ఉండడం వల్ల బస్సులు ఆపలేదని డ్రైవర్ల నుంచి వివవరణ వచ్చింది. ఆ రూట్‌లో ఉదయం, సాయంత్రం వేళల్లో మరో నాలుగు బస్సులు అదనంగా నడుపుతాం. రెండు. మూడు రోజుల్లో ఈ నాలుగు బస్టాపుల్లోనూ కంట్రోలర్స్‌ను నియమిస్తాం. అన్ని బస్సులు ఆపేలా చర్యలు తీసుకుంటాం.

నిర్మాణాల కోసం చెట్ల నరికివేత

» యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన » పట్టించుకోని అధికారులు



నిర్మాణానికి అడ్డుగా ఉందని నరికివేతకు గురైన చెట్టు

ఆరిలోవచ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల చినగదిలి కూడలి వద్ద ఓ ప్రైవేటు భవన నిర్మాణం కోసం భారీ వృక్షాన్ని నరికేశారు. సుమారు 15 సంవత్సరాలు ఈ చెట్టు ఈ ప్రాంతంలో నీడను అందించింది. ఈ ప్రాంతంలో ప్రైవేటు భవనాలు చేపడుతున్న పలువురు తమ అవసరాలకు అనుగుణంగా చెట్లను నరికివేయడం పరిపాటిగా మారిందని స్థానికులు మండిపడుతున్నారు. జీవీఎంసీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఏటా లక్షలాది రూపాయలు వెచ్చించి మొక్కలు వేయడం, పర్యావరణ పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతోనే జీవీఎంసీ సరిపెడుతోందని, కానీ ఆచరణలో చూపడం లేదన్న వాదనకు ఈ చెట్టు నరికివేతే నిదర్శనమని విమర్శిస్తున్నారు. ఇలా చెట్లను నరికి వేసే వారికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక జీవీఎంసీ, సచివాలయాల సిబ్బంది లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయంటూ ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చెట్ల అక్రమ నరికివేతను నియంత్రించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే వెలగపూడి దంపతులకు సత్కారం

» వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన తెలుగుమహిళలు



ఎమ్మెల్యే వెలగపూడి దంపతులకు సత్కరిస్తున్న తెలుగు మహిళలు

ఎంవీపీ కాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు దంపతులను ఎంవీపీ కాలనీలోని వారి నివాసంలో తెలుగు మహిళలు శుక్రవారం ఘనంగా సత్కరించారు. గడచిన రెండు దశాబ్దాలుగా తమ ప్రాంత సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్న వెలగపూడిని కొనియాడారు. శుక్రవారం వెలగపూడి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వేజెళ్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో మహిళలు ఉష, సత్య, సుధ, మంగ, లక్ష్మి, ప్రభ, లీల, నీలపు లక్ష్మి, నాయకులు మోహిత్ వర్మ, వెంపాడ శ్రీనివాసరెడ్డి, మద్ది మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, సుజన దంపతుల పెళ్లి రోజు వేడుకలు కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇక్కడ నిర్వహిస్తున్న అయ్యప్ప మాలదారులకు నిత్యాన్నదానం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే దంపతులు చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు వెలగపూడి ప్రతాప్‌రుద్ర, గ్రామ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 22 వినతులు

వెంకోజీపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 22 వినతులు వచ్చాయని చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు తెలిపారు. అధికారులు స్వీకరించిన వినతి పత్రాలను సత్వరమే నిర్ణీత సమయంలో పరిష్కరించే చర్యలు చేపట్టాలని సీసీపీ ఆదేశించారు.

మెట్రో రైలు పనులకు సమగ్ర నివేదిక

» ఢిల్లీ సదస్సుల్లో

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



సదస్సులో పాల్గొన్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, ఏడీసీ రమేశ్

సిరిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరంలో చేపట్టనున్న మెట్రో రైలు ప్రాజెక్టు పనులకు సంబంధించి సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్నామని వీఎంఆర్‌డీ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, అదనపు కమిషనర్ రమేశ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గృహ, పట్టణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఢిల్లీలో ప్రారంభమైన 18వ అర్బన్ మొబిలిటీ ఇండియా కాన్ఫరెన్స్ అండ్ ఎక్స్-2025' సదస్సులో పాల్గొన్న వారు వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో విశాఖ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. పట్టణాభివృద్ధి సదుపాయాల కల్పన, ఇతర అంశాలపై సదస్సుకు హాజరైన ప్రతినిధులకు వివరించారు. మెట్రో రైలు పనుల్లో భాగంగా నగర పరిధిలో రవాణా సదుపాయం మెరుగుపరిచేందుకు చేపడుతున్న ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై కేంద్ర మంత్రి మనోహర్ లాల్‌కు వివరించారు. జాతీయ స దస్సుల్లో భాగంగా వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న మెట్రో రైలు ప్రాజెక్టులపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను సందర్శించి, ఆయా రాష్ట్రాల ప్రతినిధుల నుంచి పలు వివరాలను సేకరించారు.

ఎమ్మెల్యే వెలగపూడి కార్యాలయంలో ప్రజా దర్బార్



ఎమ్మెల్యే వెలగపూడిని కలిసి గోడు వెళ్లబోసుకుంటున్న స్విమ్మర్లు

ఎంవీపీ కాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహణలో భాగంగా ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుంచి వినతులను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్వీకరించారు. పలువురు 22ఎ భూముల సమస్యలపై వినతులు సమర్పించారు.

అలాగే జీవీఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక సందర్భాల్లో సముద్ర తీరంలో విధులు నిర్వహిస్తున్న స్విమ్మర్లు తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. తమకు ప్రభుత్వపరంగా ఎలాంటి రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.

సినిమా గైడ్

- **ది గర్ల్ ఫ్రండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **జటాధర** : శారదా, శ్రీకన్య
- **బ్యాడ్ ల్యాండ్స్ / ఫినిక్స్** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : వెంకటేశ్వర-1,

ఘనంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు జన్మదిన వేడుకలు



వాల్తేరు డిపోలో కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేస్తున్న శివాజీ, వసంతరావు

పెదవాల్తేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్‌ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ వాల్తేరు డిపో కమిటీ అద్వర్యంలో ఎన్‌ఎంయూ విశాఖ జిల్లా గౌరవాధ్యక్షుడు, శాసనసభలో బీజేపీ పక్షనేత, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యుడు పి.విష్ణుకుమార్‌రాజు జన్మదిన వేడుకలను శుక్రవారం వాల్తేరు డిపోలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్యదర్శి ఏకే శివాజీ పాల్గొని కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాల్తేరు డిపో కార్యదర్శి ఆర్.వసంత రావు, రాష్ట్ర నాయకులు పీజీ పతి, వాల్తేరు డిపో అధ్యక్షుడు ఎస్ఎం నాయుడు, గ్యారేజ్ ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై దృష్టి సారించాలి

» ఉత్తరాంధ్ర సాధన సమితి ఆధ్వర్యంలో ఆందోళన



ఆందోళన నిర్వహిస్తున్న యూఎస్ఎస్ ప్రతినిధులు

సిరిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర అభివృద్ధిపై పాలకులు దృష్టి సారించాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర సాధన సమితి (యూఎస్ఎస్) ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఉత్తరాంధ్రపై వలసవాదుల పెత్తనం మాకొద్దని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూఎస్ఎస్ వ్యవస్థాపక కన్వీనర్ వేమిరెడ్డి లక్ష్మునాయుడు మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఉత్తరాంధ్ర వెనుకబడి పోతోందన్నారు. అపారమైన వనరులు ఉన్నప్పటికీ, వాటిని వలస వాదులు దోచుకుపోతున్నారన్నారు. 350 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉన్న ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆశించిన స్థాయిలో ప్రాజెక్టుల స్థాపన జరగటం లేదన్నారు. ఈ ప్రాంత యువత ఉపాధి కోసమని ఇతర రాష్ట్రాలకు వలసపోవాల్సిన దుస్థితి ఉందన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చూస్తోందని, దీనివల్ల ఉత్తరాంధ్రకు మరింత అన్యాయం జరగబోతుందన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుకు కారణమైన వలసవాదుల పెత్తనం నిలువరించేలా అన్ని వర్గాల వారు ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో యూఎస్ఎస్ నేతలు తిరుపతిరావు, రవికుమార్, ఆర్.అప్పలనాయుడు, నారాయణరావు పాల్గొన్నారు.

వైద్య రంగంలో పీపీపీ విధానం తగదు : ఏఐడీఎస్వో



ధర్నా నిర్వహిస్తున్న ఏఐడీఎస్వో నేతలు, కార్యకర్తలు

సిరిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేలా కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్వో) ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐడీఎస్‌వో జిల్లా అధ్యక్షుడు కె.అభిలాష్ మాట్లాడుతూ ప్రజాధనంతో నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం సరైన విధానం కాదన్నారు. వైద్య విద్య ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళితే అనేక అనర్థాలు చోటుచేసుకుంటాయని, వైద్య కళాశాలలు వ్యాపార కేంద్రాలుగా మారిపోతాయన్నారు. పీపీపీ విధానం పేరిట రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో పేదలకు మెరుగైన వైద్యం అందే పరిస్థితి ఉండదని, అందువల్ల మెడికల్ కాలేజీలను ప్రభుత్వ ఆధీనంలోనే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షుడు సంతోష్, ఇతర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 26, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 62, బెండకాయలు 48, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 50, బీరకాయలు 54, ఆనపకాయ 34, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్ 58, దొండకాయలు 42, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం (పాతది) 64, బరబాటి 48, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 30, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 30, కంద 46, దేముడు చిక్కుడు 70, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు

బ్రాయిలర్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

చండికాదేవి ఆలయంలో సుందర కాండ పారాయణం



అలంకరణలో అమ్మవారు

ఎంవీపీ కాలనీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ నాలుగో సెక్టరులోని శ్రీమాత చండికాదేవి ఆలయం ఆవరణలో శుక్రవారం సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా నిర్వహించారు. భక్తులు సామూహికంగా ఆలపించారు. సంప్రదాయ రీతిలో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. ఆలయ కమిటీ మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసింది.

పరీక్ష కేంద్రాలు తనిఖీ

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీజీ సెమిస్టర్ పరీక్షలను స్క్వాడ్ సభ్యులు ప్రొఫెసర్ పీవీ లక్ష్మీనారాయణ, డాక్టర్ కేవీ రమణమూర్తి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గాజువాక ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎనిమిది మంది విద్యార్థులు, గాజువాక చైతన్య డిగ్రీ, పీజీ ఉమెన్స్ కళాశాలలో ముగ్గురు, ద్వారకానగర్ ప్రిజమ్ డిగ్రీ, పీజీ కళాశాలలో ముగ్గురు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్నట్టు గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని పరీక్షల విభాగాధికారులకు సూచించారు.


బిల్లులు చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్టర్ల ధర్నా



ధర్నాలో పాల్గొన్న కాంట్రాక్టర్లు

సిరిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేసిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టర్లు శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు జీవీఎంసీ పరిధిలోని కాంట్రాక్టర్లు ధర్నాలో పాల్గొన్నారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పీవీవీ నాగరాజు, ఎం.సంజీవరెడ్డి మాట్లాడుతూ గత 13 నెలలుగా రూ.400 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఎస్‌డీఎఫ్, జీజీఎంపీ బిల్లులు ఆరేళ్లుగా చెల్లించడం లేదన్నారు. ఈఎండీ, ఎఫ్ఎస్‌డీ, ఏఎస్‌డీ డిపాజిట్లు రెండేళ్ల కాల వ్యవధి అయిన వెంటనే తిరిగి వచ్చేలా సాఫ్ట్‌వేర్ రూపొందించాలన్నారు. పద్ధతి ప్రకారం బిల్లులు చెల్లించాలన్నారు. జీవీఎంసీ బడ్జెట్ ఉన్న పనులకే టెండర్లు పిలవాలని, నిధి పోర్టల్‌లో జీవీఎంసీకి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ధర్నాలో ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.రమేష్, అసోసియేషన్, నాయకులు జి.సింహాచలం, రాజాన వెంకటరమణ, టీ.వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

13వ వార్డు టీడీపీ నూతన కార్యవర్గం



కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డు టీడీపీ నూతన కార్యవర్గం ఎన్నికకు శుక్రవారం ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా ఏడువాక సన్యాసిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా తురకపూడి బాలస్వామి, ఉపాధ్యక్షులుగా మారిక జగన్నాథరావు, కిల్లంశెట్టి శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా సోనాపురం సుధాకర్, గుంజ శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా వారనాసి అప్పారావు, అధికార ప్రతినిధిగా పి.రాధమ్మ, కార్యవర్గ సభ్యులుగా ఓసెట్టి పైడిరాజు, నేతల త్రినాథరావు, వై.సూరిబాబు, ఆర్.వెంకటరావు, కె.వెంకటేష్, చింతలపూడి నాగేశ్వరరావు, ప్రశాంత్, నరేష్, దేవర శ్రీనివాసరావు, ఎస్‌కె సేథ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు నూతన కమిటీని అభినందించారు. అంతా కష్టపడి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

భువనేశ్వరి దేవి అమ్మవారి అదివాస మహోత్సవం రేపు

డాబాగార్డెన్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భువనేశ్వరి దేవి ఆరాధన పీఠం, ఓం భువనేశ్వరి సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యాతపాలెం చెల్లాయమ్మతోటలోని భువనేశ్వరిదేవి అమ్మవారికి 'జిల్లేడు పత్రి'తో ఈ నెల 9న అదివాస మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ట్రస్టు నిర్వాహకులు మురళీకృష్ణ తెలిపారు. కృష్ణగార్డెన్స్ ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం పండితులు, పెద్దలతో అమ్మవారికి సుగంధద్రవ్యాలు, దివ్య పంచామృతాలతో మంగళస్నానం చేయిస్తారన్నారు. చీర, జాకెట్టు, రామఫలం, తమలపాకులతో స్వయంగా పూజ చేసుకోవచ్చన్నారు.

300 మందికి ఉచిత వైద్యచికిత్స



చికిత్స చేస్తున్న వైద్యురాలు

అల్లిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 32వ వార్డు నేరళ్లకోనేరు వద్ద శుక్రవారం కేఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ కందుల నాగరాజు ప్రారంభించిన ఈ శిబిరంలో సుమారు 300మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్, కేర్ హాస్పిటల్,పుష్పగిరి ఐ హాస్పిటల్ వైద్య సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సుభద్ర, సౌజన్య, పాల్, కో-ఆర్డినేటర్ సీహెచ్ స్వాతిశ్రీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

16న విద్యార్థులకు భగవద్గీత పఠన పోటీలు

డాబాగార్డెన్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకొని ఈ నెల 16న ఉదయం 9 గంటలకు గీతా భవనంలో భగవద్గీతలోని 15వ అధ్యాయంపై మౌఖిక పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు తెలిపారు. 5 నుంచి 8 ఏళ్ల వరకు ప్రథమ, 9 నుంచి 12 వరకు ద్వితీయ, 13 నుంచి 20 వరకు తృతీయ, 21, ఆపై వయసు వారిని చతుర్థవర్గానికి అర్హులుగా పరిగణించనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు ఈ నెల 10లోగా సంస్థ కార్యదర్శి ఎం.వనజాదేవిని ఫోన్ (70326 62344)లో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా సారె మహోత్సవం

జ్ఞానాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గౌరీపరమేశ్వరుల లీలా మహోత్సవాల్లో భాగంగా అల్లిపురం వెంకటేశ్వరమెట్ట వద్ద గౌరీ సేవాసంఘం, వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో శుక్రవారం కుంకుమ పూజ ఘనంగా నిర్వహించారు. గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పది వీధులకు చెందిన వందలాది మంది మహిళలు మిఠాయిలు, పండ్లతో పురవీధుల్లో ఊరేగించి వైభవోపేతంగా సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పెండింగ్ చలానాల తనిఖీ

మాధవధార, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి పర్యవేక్షణలో శుక్రవారం ఆర్అండ్‌బీ జంక్షన్‌లో పోలీసు సిబ్బంది వాహనాల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పెండింగ్ చలానాలు, హెల్మెట్ లేకుండా వెళ్లడం సహా సిగ్నల్ జంప్, అధిక లోడుతో వెళ్లే ఆటోలు, సీట్ బెల్టు లేని కార్ల డ్రైవింగ్‌పై దృష్టి సారించారు. చలానా రుసుము చెల్లించకపోతే లైసెన్సు రద్దయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అపరాధ రుసుము వసూలు చేసి వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు.

పెట్రోల్ దొంగతనాల జోరు

మహారాణిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ దొంగలతో స్థానికులు అల్లాడిపోతున్నారు. మహారాణిపేట పోలీసు స్టేషన్ పరిధిలోని అంగటి దిబ్బ, జిల్లా పరిషత్ జంక్షన్, రామజోగిపేట తదితర ప్రాంతాల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అర్ధరాత్రి దాటాక ఇంటి సమీపంలో పార్కింగ్ చేసి పెట్టుకున్న వాహనాలలో పెట్రోల్ చోరీ చేస్తున్నారు. రాత్రి వేళల్లో వాహనం బయట పెట్టాలంటే భయపడుతున్నారు. రెండు, మూడు రోజులుగా పెట్రోల్ దొంగతనాలు జరుగుతుండడంతో బాధితులు మహారాణిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరుల ఆట కట్టించాలని బాధితులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి

దాటుతుండగా అనకాపల్లి నుంచి గాజువాక వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న మునగపాక మండలం చూచుకొండ గ్రామానికి చెందిన సారిక నాగరాజు (48), అతని కుమారుడు జవహర్‌లు ఢీకొట్టారు. దీంతో రమణమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం తెలుసుకున్న దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. తీవ్ర గాయాలపాలైన నాగరాజు, జవహర్‌లను కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సారిక నాగరాజు (48) మృతిచెందారు. జవహర్‌కు గాయాలయ్యాయి. డిగ్రీ పూర్తిచేసిన జవహర్ ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. తారక్ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జవహర్ నుంచి ఫిర్యాదు రావాల్సి ఉందని పోలీసులు తెలిపారు.



తూర్పుకోస్తారైల్వే డివిజన్ కనస్ట్రక్షన్స్ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన



ఆంధ్ర వైద్య కళాశాలలో సామూహికంగా ఆలాపన

సామూహికంగా వందేమాతరం గీతాలాపన

విశాఖపట్నం/మహారాణిపేట/సీతమ్మధార నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వందేమాతర గీతం రచించి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం వివిధ ప్రాంతాల్లో సామూహికంగా వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కేజీహెచ్ ప్రధాన పరిపాలనా విభాగం ఎదుట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి వందేమాతర గీతం ప్రాముఖ్యతను వివరించారు. ఆంధ్ర వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, వైద్యసిబ్బంది, ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు గీతాలాపన చేశారు. వాల్తేరు రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు గీతాన్ని సామూహికంగా ఆలపించారు. డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ జాతీయ గీతం మనదేశ ఐక్యత, భక్తి, ఆత్మ గౌరవ స్ఫూర్తికి చిహ్నంగా నిలిచిందని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన ఈ గీతం ప్రతి ఒక్కరిలో ఐక్యతను నింపిందన్నారు. ఈ వేడుకలను డివిజన్ వ్యాప్తంగా అన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో నిర్వహించామన్నారు. తూర్పుకోస్తారైల్వే డివిజన్ కనస్ట్రక్షన్స్ కార్యాలయంలోనూ వందేమాతరం వేడుక జరిగింది. చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్త ముఖ్య అతిథిగా హాజరుకాగా, చీఫ్ ఇంజనీర్లు శ్రీనివాసరావు, విష్ణుమూర్తి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అంకుష్ గుప్త మాట్లాడుతూ ప్రతి భారతీయుడు గర్వంగా భావించే వందేమాతర గీతం 150 ఏళ్ల వేడుకలు ఘనంగా జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ఐక్యత, దేశభక్తి, సామరస్యతను చాటే ఈ గీతం భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ మొల్లి శోభ పర్యవేక్షణలో సీతమ్మధార రైతుబజార్‌లో ఎస్టేట్ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి అధ్యక్షతన రైతులు, మార్కెటింగ్ కమిటీ ప్రతినిధులు, వందేమాతరం గీతాలాపన చేశారు.

పతకాలు తెచ్చేలా నైపుణ్యం చూపండి: ఎమ్మెల్యే గణబాబు



వాలీబాల్ క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న గణబాబు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11 నుంచి ఉత్తరప్రదేశ్‌లోని బరేలిలో జరగనున్న జాతీయ వాలీబాల్ టోర్నీలో ప్రతిభా నైపుణ్యాన్ని ప్రదర్శించి రాష్ట్రానికి పతకాలు తేవాలని పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ఆకాంక్షించారు. గతంలో రాణించినవారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పోర్టు స్టేడియంలోని శాయ్ శిక్షణ కేంద్రంలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ అండర్-17 బాలురు, బాలికల చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్ల శిబిరానికి శుక్రవారం సాయంత్రం ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు సామగ్రిని పంపిణీ చేశారు. ఇటీవల జరిగిన స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి టోర్నీలో విశాఖ వాలీబాలర్లు అద్భుతంగా రాణించి జాతీయ పోటీలకు ఎంపిక కావడం ఆనందదాయకమన్నారు. స్కూల్ గేమ్స్ టోర్నీల ద్వారా అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని సూచించారు. శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి సత్యనారాయణ, కోచ్ సూరిబాబు, ఎస్‌జీఎఫ్ కోచ్ సురేష్, జిల్లా వాలీబాల్ సంఘం ప్రతినిధులు మోహనబాబు, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుడి సన్నిధిలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు ఆదిత్యుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్

అరసవల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లిలో ఆదిత్యుడ్ని విశాఖపట్నం నార్త్‌జోన్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు(బీజేపీ) కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్ వారికి అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి రంజిత్‌శర్మ, దర్భముళ్ళ శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

11 నుంచి జిల్లా సివిల్ సర్వీసు క్రీడా జట్ల ఎంపిక

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసు ఉద్యోగుల క్రీడా పోటీల్లో పాల్గొనే జిల్లా పురుషులు, మహిళల జట్ల ఎంపికలు ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి జూన్ గ్యాలియట్ తెలిపారు. ఏయూ జిమ్నాజియం ఇండోర్ హాలులో పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్; బీచ్‌రోడ్డులోని ఆక్వా స్పోర్ట్సు కాంప్లెక్సులో స్విమ్మింగ్; ఆఫీసర్స్ క్లబ్‌లో టెన్నిస్ ఎంపికలు జరుగుతాయన్నారు. 12న గోపాలపట్నం ఇండోర్ స్పోర్ట్స్ హాల్లో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్యారమ్, చెస్ ఎంపికలు, 13న కొమ్మాదిలోని శాప్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్సు కాంప్లెక్సులో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, ఖోఖో, హాకీ, కబడ్డీ, వాలీబాల్, యోగా, రెజ్లింగ్, మ్యూజిక్ అండ్ డ్యాన్స్, షార్ట్ ప్లే ఈవెంట్లలో ఎంపికలు జరుగుతాయని వివరించారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19 నుంచి 22 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని, వివరాలకు క్రీడా ప్రాధికార సంస్థ ఫోన్:83094 17921లో సంప్రదించాలన్నారు.

తెలుగు భాష పరిరక్షణ కోసం 10న సత్యాగ్రహం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తెలుగు దండు ప్రతినిధులు

సీతంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ దొర జయంతిని పురస్కరించుకొని ఈ నెల 10న సెంట్రల్ పార్కు సమీపంలోని గాంధీ పార్కులో సత్యాగ్రహం నిర్వహిస్తున్నట్లు తెలుగుదండు వ్యవస్థాపక అధ్యక్షుడు పరవస్తు సూరి తెలిపారు. గురుద్వార కూడలి శాంతిపురంలోని తెలుగు దండు కార్యాలయంలో శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను పలువురు ప్రముఖులతో కలిసి ఆవిష్కరించారు. వైసీపీ ప్రభుత్వం తెలుగు భాషకు చేసిన అన్యాయం వల్ల రెండు, మూడు తరాల బిడ్డలు మన భాషకు దూరమయ్యారని సూరి ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం కూడా ఇంతవరకు అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేయలేదన్నారు. తెలుగు భాషా వైభవం నేతల ప్రసంగాల్లో తప్ప చేతల్లో శూన్యంగా కనిపిస్తోందన్నారు. మాతృభాష వ్యతిరేక చర్యలను ప్రశ్నించాలనే ఉద్దేశంతో ఈ నెల 10న సత్యాగ్రహంలో కూర్చుంటామన్నారు. ఇందులో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలుగు భాష పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రజా ఉద్యమమే తెలుగుదండుగా వక్తలు పేర్కొన్నారు. అధికార భాషా సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, అన్ని బడులలో ప్రాథమిక విద్యాబోధన తెలుగులోనే జరగాలని, ఆంగ్లాన్ని ఒక పాఠ్యాంశంగా బోధించాలని, గత ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన వ్యాజ్యాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్ డి.వి.సూర్యారావు, అడపా రామకృష్ణ, డాక్టర్ కొచ్చెర్లకోట, చిన సూర్యనారాయణ, ప్రజాకవి దేవిశ్రీ, నాంచారయ్య, తెలుగుదండు పాఠకులు శ్రీధర్, సురేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌పై విజయం సాధ్యమే

▸▸ ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు

మహారాణిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్క్రీనింగ్ చేయడం ద్వారా క్యాన్సర్‌పై విజయం సాధించవచ్చని ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి అన్నారు. శుక్రవారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా కేజీహెచ్ పరిపాలనా విభాగం కార్యాలయం ఎదుట వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంధ్యాదేవి మాట్లాడుతూ జీవన ప్రమాణాలు పెరగటం, జీవన శైలిలో మార్పులు రావటంతో అసంక్రమిత, దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అధిక రక్తపోటు (బీపీ), చక్కెర (సుగర్), క్యాన్సర్ వ్యాధులు గణనీయంగా పెరుగుతున్నాయని తెలిపారు రాష్ట్రంలో హెచ్చుసంఖ్యలో క్యాన్సర్ కేసులు నమోదవుతుండగా, వీటిలో చాలావరకు ఆలస్యంగా గుర్తిస్తున్నారని, నయం చేయలేని పరిస్థితులలో అధిక మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకుని, క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముందుగా గుర్తిస్తే పూర్తిగా నయం చేయగల వ్యాధి క్యాన్సర్ అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఉచితంగా నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై స్క్రీనింగ్ సదుపాయం కల్పిస్తోందని తెలిపారు. ఈ పరీక్షల కోసం ఇంటి వద్దకు వచ్చే ఆరోగ్య సిబ్బందికి సహకరించాలని సంధ్యాదేవి కోరారు. ఆరోగ్య కేంద్రాల్లోనూ ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని, వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి. జగదీశ్వరరావు, డాక్టర్ శిల్ప, డాక్టర్ సాయి సుష్మా, డాక్టర్ హారిక, వైద్యాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక స్ఫూర్తి ప్రదాత పార్వతీకుమార్'



మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీలో పాల్గొన్న అతిథులు

అక్కయ్యపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భౌగోళికంగా ఆధ్యాత్మిక, సామాజిక రంగాల ద్వారా మాస్టర్ కె.పార్వతీకుమార్ అందించిన సేవలు నిరుపమానమని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) డైరెక్టర్ ఆఫ్ సర్వీసెస్ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ కొనియాడారు. మాస్టర్ ఈకే సంస్కృతి సదన్ ప్రాంగణంలో జగద్గురు పీఠం సోదరబృందం నిర్వహించిన మాస్టర్ పార్వతీకుమార్ 81వ జయంతి ఉత్సవం సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాస్టర్ ఎక్కిరాల కృష్ణమాచార్య స్థాపించిన ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ భౌగోళిక అధ్యక్షునిగా ఆయన దేశ, విదేశాల్లో విశేషమైన ఆధ్యాత్మిక కృషి చేశారని తెలిపారు. పార్వతీకుమార్ రెండు వందలకు పైగా తెలుగు, ఆంగ్ల పుస్తకాలు రచించారని, కొన్ని జర్మన్, స్పానిష్ భాషలలోకి అనువదించారన్నారు. సంస్కృతి సదన్‌లో టైలరింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన 20 మంది మహిళలకు ధ్రువపత్రాలు, పది మందికి కుట్టు మిషన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ హోమియో వైద్యాలయ నిర్వాహకురాలు డాక్టర్ అజ్జరపు సుబ్బలక్ష్మి, కేఎల్ నరసింహం, మామిడన్న శ్రీనివాస్, ఎస్వీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి నైపుణ్య పోటీలు

మహారాణిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేటలోని సెయింట్ ఆంథోనీ పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి నైపుణ్య పోటీలు నిర్వహించారు. విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ బి.విజయభాస్కర్, సమగ్రశిక్షా కో-ఆర్డినేటర్ డా చంద్రశేఖర్‌రావులు ముఖ్య అతిథులుగా విచ్చేసి పోటీలు ప్రారంభించారు. ఇందులో 28 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల నుంచి 10 రకాల వృత్తి విద్యా విభాగాల నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొని 96 ప్రాజెక్టులను ప్రదర్శించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచినవారికి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 బృందాలను సమగ్రశిక్షా రాష్ట్ర కార్యాలయం నిర్వహించే పోటీలకు పంపిస్తామన్నారు. ఈ సమావేశంలో అధికారులు జి.శ్రీదేవి, సోమేశ్వరరావు, 46 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులతో సహకారబ్యాంకు సిబ్బంది

కంచరపాలెం: అంతర్జాతీయ సహకార దినోత్సవం నేపథ్యంలో విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు కంచరపాలెం శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. స్థానిక ఊర్వశి జంక్షన్ సమీపంలోని రైట్ వే స్కూల్లో విద్యార్థులకు సహకార సదస్సు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాచరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరిచినవారికి జ్ఞాపికలు, బహుమతులు ప్రదానం చేశారు. బ్యాంకు అధికారులు యు.పార్వతీదేవి, ఎంవీ గణేష్, డి.పావని, పి.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సుదర్శన్ పాల్గొన్నారు.

ఘనంగా హాకీ క్రీడ శతాబ్ది వేడుకలు



ధ్యాన్‌చంద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హాకీ క్రీడాకారులు, అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విశాఖలో హాకీ క్రీడ శతాబ్ది వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి హాకీ విశాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కేఈ అప్పారావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆంజనేయరావు, భవానీప్రసాద్, అంబు, రాంజీ, సీనియర్ హాకీ క్రీడాకారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ భారత క్రీడారంగానికి ప్రపంచ వ్యాప్తంగా విశేష ఖ్యాతి తెచ్చిన తొలి క్రీడాంశంగా హాకీకి ప్రత్యేక స్థానముందన్నారు. దేశానికి అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులను అందించిన ఘనత విశాఖకు దక్కుతుందన్నారు. హాకీ క్రీడకు అవసరమైన ఆస్ట్రో టర్ఫ్ మైదానాన్ని ఏర్పాటు చేయాలని దీర్ఘకాలంగా కోరుతున్నా కార్యరూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు ఇందుకు చొరవ చూపాలని కోరారు. విశాఖ నుంచి అంతర్జాతీయ, జాతీయ స్థాయి టోర్నీలలో పాల్గొన్న హాకీ పూర్వ క్రీడాకారులు గోపాలకృష్ణ, అంబు, గోపి, జూన్ గ్యాలియట్, అబ్దుల్, చిల్లీ, స్టాన్లీ, మూర్తి, శ్రీనివాస్, నెల్సన్ పీటర్, శివ, మోహన, దుర్గా, మాధవిలను ఘనంగా సత్కరించారు. అనంతరం ధ్యాన్‌చంద్ విగ్రహం నుంచి ఆర్‌కె బీచ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి హాకీ క్రీడ ప్రాముఖ్యతను చాటిచెప్పారు. ఏయూ గ్రౌండ్‌లో జరిగిన వందేమాతరం గీతం వందేళ్ల కార్యక్రమంలో పాల్గొన్న ఏయూ ఉపకులపతి ఆచార్య రాజశేఖర్...హాకీ శతాబ్ది వేడుకలకు ఊహించని అతిథిగా పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

కేజీహెచ్‌లో మహిళ మృతి

▸▸ ఆక్సిజన్, విద్యుత్ సరఫరా లేకనే: బంధువులు

▸▸ మద్యం అలవాటుతోనే మరణం: కేజీహెచ్ సూపరింటెండెంట్

మహారాణిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో గురువారం రాత్రి సుమారు 11 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయిన కారణంగా మహిళ మృతి చెందినట్లు ఆమె బంధువులు ఆరోపించారు. తెలంగాణలోని దోమకొండ ప్రాంతానికి చెందిన వి.దేవి మర్రిపాలెంలో బంధువుల ఇంటికి వచ్చి అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చేరింది. ఆ సమయంలో తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు ఉండేవి. వైద్య పరీక్షల అనంతరం ఆమెకు అత్యవసర చికిత్స అందించారు. పరిస్థితి మెరుగుపడటంతో సాధారణ వార్డుకు తరలించారు. ఈ క్రమంలో గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఆమె పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ఘటనపై ఆమె సోదరి మాట్లాడుతూ ఆక్సిజన్ అందకపోవటం, విద్యుత్ సరఫరా లేకపోవటమే మృతికి కారణమని ఆరోపించింది. దీనిపై కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ.వాణి వివరణ ఇస్తూ.. ఆక్సిజన్, రక్తపోటు నార్మల్‌గా ఉండడంతో సాధారణ వార్డుకు తరలించామన్నారు. రాత్రి సమయంలో ఆమె ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా మారిపోవడంతో వైద్య పరీక్షలు నిర్వహించామని, హఠాత్తుగా గుండెపోటు రావటంతో మృతి చెందిందన్నారు. దేవికి మద్యం తాగే అలవాటు ఉండడంతో కాలేయ సమస్య వచ్చిందని, అది కూడా ఆమె మృతికి ఒక కారణంగా సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

కేజీహెచ్‌కు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

... 5వ పేజీ తరువాయి

ఉన్నతాధికారులు పట్టనట్టు వ్యవహరించడం వల్లే రోగులు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చిందంటున్నారు. ఈ సమస్యకు సంబంధించిన వీడియో సోషల్ మీడియోలో వైరల్‌గా మారిన తరువాత ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు తలంటిన తరువాతే ఏపీఈపీడీసీఎల్ అధికారులకు ఆస్పత్రి అధికారులకు సమాచారాన్ని అందించినట్టు చెబుతున్నారు. అప్పటివరకూ ఆస్పత్రిలో ఉన్న ఎలక్ట్రికల్ సిబ్బందితోనే సమస్యను పరిష్కరించే ప్రయత్నాలు చేశారు. అదే సమస్య ఉత్పన్నమైన వెంటనే ఆస్పత్రి అధికారులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి ఉంటే సాయంత్రానికి పరిష్కారమయ్యేదని చెబుతున్నారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణిని వివరణ కోరగా తాను కోర్టు పనులు నిమిత్తం విజయవాడ వెళ్లానన్నారు. అయినప్పటికీ సమస్య తెలిసిన వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరించే ప్రయత్నం చేసినట్టు తెలిపారు. నేరుగా విజయవాడ నుంచి ఆస్పత్రికే వచ్చి పనులను పర్యవేక్షించానని, అప్పటికే డిప్యూటీ సూపరింటెండెంట్లు, అడ్మినిస్ట్రేటర్, ఇతర అధికారులు పనులు జరుగుతున్న ప్రాంతంలోనే ఉన్నారన్నారు. ఇదిలావుండగా ఆస్పత్రిలో నిర్వహణ పనుల కారణంగా తలెత్తిన సమస్యను సిబ్బందితో కలిసి పరిష్కరించి రాత్రి 11.45 గంటలు సమయంలో సరఫరా పునరుద్ధరించామని ఏపీఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ ఎస్ఈ జి.శ్యాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

డిగ్రీ పూర్తికి మరో అవకాశం

... 5వ పేజీ తరువాయి

రూ.లక్షకుపైగా చెల్లించాల్సి ఉంటుంది. అందుకే పెద్దగా ఎవరూ ముందుకురాలేదు. ఈ నేపథ్యంలో నామమాత్రపు ఫీజు చెల్లించి ఒకేసారి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు రాసుకునేందుకు అవకాశం కల్పించాలని తాజాగా వర్సిటీ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కొద్దిరోజుల్లో షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్టు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ తెలిపారు. ఇది వందలాది మంది విద్యార్థులకు మేలు చేస్తుందన్నారు. ఇప్పుడు డిగ్రీ విద్యార్థులు చెల్లిస్తున్న ఫీజునే వసూలు చేయనున్నారు.

తత్కాల్ ఫీజు రద్దు

వర్సిటీ అధికారులు మరో కీలక నిర్ణయాన్ని తీసుకున్నారు. వివిధ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అత్యవసరంగా కావాలంటే ప్రస్తుతం నిర్ణీత రుసుము కంటే కొంచెం ఎక్కువ మొత్తం (తత్కాల్ పద్ధతి) వసూలు చేస్తున్నారు. తత్కాల్ విధానంలో సర్టిఫికెట్లను ఒకటి, రెండు రోజుల్లో ఇస్తున్నారు. అయితే, తత్కాల్ ఫీజు విద్యార్థులకు భారంగా మారుతుందని గ్రహించిన అధికారులు దానిని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులకు నిజంగానే అత్యవసరంగా సర్టిఫికెట్లు కావాల్సి వస్తే...తత్కాల్ విధానంలో ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేకుండా ఒకరోజులో ఇచ్చేలా చర్యలు చేపడుతున్నారు. దీనికి సంబంధించి ఆదేశాలను ఇప్పటికే ఎగ్జామినేషన్ విభాగానికి ఇచ్చినట్టు వైస్ చాన్సలర్ వెల్లడించారు.

అమ్మవారి సన్నిధిలో కొత్త సంప్రదాయాలేల?

... 5వ పేజీ తరువాయి

వేస్తున్నామని ఈఓ శోభారాణి సమాధానం ఇవ్వగా, దానిని స్థానికులు ఖండించారు. రాత్రిపూట వెండి తాపడం తీసేస్తున్నారని స్పష్టంచేశారు.

తెల్లవారుజామున 5-6 గంటల మధ్య పూజారులు వచ్చి పూజలు చేశాకే ఇతరులను అమ్మవారి సన్నిధికి అనుమతించే సంప్రదాయం ఈవో తీసుకువచ్చారని ఫిర్యాదు చేశారు. అమ్మవారి దర్శనాలకు ఇలాంటి నిబంధనలు గతంలో ఎన్నడూ లేవన్నారు. అయ్యప్పస్వాములు తెల్లవారు జామున నాలుగు గంటలకు వస్తే వారిని మండపం దాటి ముందుకు వెళ్లనివ్వడం లేదని స్థానిక కార్పొరేటర్ దంపతులు ఫిర్యాదు చేశారు. అమ్మవారిపై పాలు, పెరుగు, కొబ్బరికాయల నీళ్లు నేరుగా వేసేవారమని, ఇప్పుడు ప్రత్యేక పాత్రలు పెట్టి...వాటిలో పోయమంటున్నారని, అవన్నీ నిండాక అమ్మవారి తలపై జల్లెడ పెట్టి అందులో పోస్తున్నారని వారంతా ఎమ్మెల్యేకు వివరించారు. ఈ ఆలయంలో భక్తులు ఎవరి పూజ వారు చేసుకునే సంప్రదాయం ఉందని, దానికి ఈఓ శోభారాణి అడ్డంకులు సృష్టిస్తున్నారని, కొత్త పద్ధతులు తొలగించి పాత విధానాల ప్రకారమే అన్నీ జరిగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. అన్నీ విన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్...భక్తుల మనోభావాలు, ఆలయ సంప్రదాయాల ప్రకారం ముందుకు వెళ్లాలని, స్థానికులను ఇబ్బందులకు గురిచేయవద్దని ఈఓకు సూచించారు.

ఉప ఖజానా దొంగలపై కొరడా

... 5వ పేజీ తరువాయి

చేపట్టింది. సుదీర్ఘంగా విచారించి 2021లో ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అప్పటి నుంచి పలుమార్లు విజిలెన్స్ అధికారులు వార్షిక నివేదికలలో ట్రెజరీ కుంభకోణం విషయాన్ని ప్రస్తావిస్తూ వచ్చారు. చివరకు ఈ ఏడాది ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖను ఆదేశించింది. దీంతో 2011 నుంచి 2017 వరకు జరిగిన పింఛన్ సొమ్ముల స్వాహాకు సంబంధించి అప్పట్లో సీతమ్మధార డివిజనల్ సబ్‌ట్రెజరీలో పనిచేసి ప్రస్తుతం సీనియర్ అకౌంటెంట్లుగా ఉన్న 11 మందిపై చర్యలు తీసుకోవాలని విశాఖలోని ఖజానా కార్యాలయం డీడీని ఖజానా రాష్ట్ర డైరెక్టర్ ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం జిల్లా కార్యాలయంతోపాటు అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్న 11 మందికి ఆయన చార్జిమెమోలు జారీచేశారు. పింఛన్ల సొమ్ము స్వాహాకు సంబంధించిన వ్యవహారంలో ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. చార్జిమెమోలు అందుకున్న వారిలో చినఅప్పలరాజు, శ్రావ్య గోపాల్, హైమా, పైడిరాజు, అశోక్, రాజు ప్రకాశ్, బేబీ చైతన్య, తదితరులు ఉన్నారు. వీరిలో కొందరు కొంత సమయం కావాలని డీడీని కోరారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అర్ధరాత్రి వరకూ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

ఇచ్చింది. వాటికి ఇప్పుడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా కన్వేయన్స్ డీడ్స్ ఇస్తోంది. వీఆర్‌ఓల ద్వారా మండలాల తహశీల్దార్లు ఈ రిజిస్ట్రేషన్లను చేయిస్తున్నారు. జిల్లాలో 24 వేల రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 13 వేలు పూర్తయ్యాయి. ఆక్రమితదారుడి పేరిట రిజిస్ట్రేషన్ చేసిన తరువాత ఆ డాక్యుమెంట్‌ను తహశీల్దార్ సూచించిన వీఆర్‌ఓకే ఇస్తారు. కక్షిదారులకు ఇవ్వరు. అయితే వీఆర్‌ఓలు గ్రామంలో అన్ని రిజిస్ట్రేషన్లు పూర్తయిన తరువాత వచ్చి తీసుకువెళతామంటూ వాటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉంచేస్తున్నారు. ఇవి రెండో రకం పెండింగ్ డాక్యుమెంట్లు. ఇలాంటివి ఒక్కో కార్యాలయంలో 200 వరకూ ఉన్నాయి. వీటిని కూడా ఏసీబీ అధికారులు తప్పుబట్టారు. ఎప్పటికప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని సబ్ రిజిస్ట్రార్లను ప్రశ్నించారు. అందులో తమ జాప్యం లేదని రెవెన్యూ సిబ్బందే చెప్పినట్టు సమాచారం. ఏసీబీ అధికారుల అభ్యంతరం చెప్పిన నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి రెవెన్యూ అధికారులకు వాటిని తీసుకువెళ్లాల్సిందిగా శుక్రవారం లేఖలు వెళ్లాయి.

విశాఖలో దొరికింది రూ.10 వేలు మాత్రమే

ఏసీబీ అధికారులు విశాఖ జిల్లాలో మూడు కార్యాలయాల్లో సోదాలు చేస్తే సూపర్‌బజార్ (ఆర్‌వో) కార్యాలయంలో మాత్రమే రూ.10 వేల నగదు ఒక పెళ్లి కార్డు కవరులో దొరికింది. అది ఎవరు తెచ్చారు?, ఎవరికి ఇచ్చారు?...అనే వివరాలు బయటకు రాలేదు. మధురవాడ, పెదగంట్యాడ కార్యాలయాల్లో ఏమీ లభించలేదు. పలువురు డాక్యుమెంట్ రైటర్ల వద్ద నగదు, వారి ఫోన్ల లావాదేవీలను ఏసీబీ అధికారులు పరిశీలించారు. వాటి వివరాలు కూడా నమోదు చేసుకున్నారు.

దుర్గమాంబకు పూజలు

అగనంపూడి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం మూడో శుక్రవారం సందర్భంగా 85వ వార్డు అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామా పారాయణం నిర్వహించారు.

అమ్మవారి సారె ఊరేగింపు


అమ్మవారి సారె ఊరేగింపులో మహిళలు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 69వ వార్డు వెంకటేశ్వర కాలనీలో జరుగుతున్న గౌరీపరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి సారే ఊరేగించారు. మహిళలు పలు రకాలు స్వీట్లు, పండ్లు, పూలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు.

ఆటోనగర్ : జీవీఎంసీ 70వ వార్డు టీవీఎస్ కాలనీలో గౌరీపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా దానప్ప తల్లి ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో దానప్ప ఆలయం

కూర్మన్నపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87వ వార్డు దుగ్గపువానిపాలెంలో కాళింగుల ఆరాధ్య దైవం దానప్ప తల్లి ఉత్సవం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రెండు రోజులు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు ముర్రాట, సారె ఊరేగింపు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ తెలపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని అరటి గెలలు, మామిడి తోరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

శ్రీవారికి ప్రత్యేక అభిషేకాలు

పెందుర్తి, నవంబరు 7 ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటాద్రిపై కొలువైన వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పాలు, పెరుగు, తేనె, పసుపు, గంధం, సుగంధ ద్రవ్యాలతో నేత్రపర్వంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి తులసి దళాలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

సినిమా గైడ్

- **ది గర్ల్ ఫ్రెండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ),నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **జటాధర** : శారదా, శ్రీకన్య
- **బ్యాడ్ ల్యాండ్స్ / ఫినిక్స్** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : వెంకటేశ్వర-1,

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 26, వంకాయలు (తెలుపు) 44, వంకాయలు (నలుపు) 62, బెండకాయలు 48, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 50, బీరకాయలు 54, ఆనపకాయ 34, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 22, క్యారెట్58, దొండకాయలు 42, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 76, అల్లం(పాతది) 64, బరబాటి 48, ముల్లంగి30,నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు54, దోసకాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 30, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు30, కంద 46, దేముడుచిక్కుడు70, గోరుచిక్కుడు 42, కూరపెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 64, కరివేపాకు (కిలో) 50,కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడిఅల్లం 64, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు

బ్రాయిలర్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230


పెందుర్తిలో జాతీయ జెండాతో ర్యాలీ


అగనంపూడి : వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న పలు సంస్థల ప్రతినిధులు


ఇస్లాంపేట హైస్కూల్‌లో వందేమాతరం గేయం ఆలాపన

ఘనంగా వందేమాతరం 150 ఏళ్ల ఉత్సవం

» ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థల్లో నిర్వహణ
» గోపాలపట్నంలో వెయ్యి మంది విద్యార్థులతో గేయం ఆలాపన

ఉక్కుటౌన్‌షిప్ /గాజువాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇస్లాంపేట హైస్కూల్‌లో వందేమాతర గీతాలపన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ జి.ప్రమీళ మాట్లాడుతూ బంకించంద్ర చటర్జీ 1875 నవంబరు 7వ తేదిన వందేమాతర గీతాన్ని కొంత భాగం సంస్కృతం, మరికొంత భాగం బెంగాల్ భాషలో రచించారని అన్నారు. గీతం రచించిన 150 సంవత్సరాలకు పూర్తి గీతాన్ని ఆలపించే అదృష్టం దక్కిందన్నారు. ఈ గీతం బ్రిటీష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిందన్నారు.

150 సార్లు అలపించిన విద్యార్థులు

మల్కాపురం: వందేమాతర గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక పిలకవానిపాలెం జంక్షన్‌లో ఉన్న లక్కీ అమర్ స్కూల్‌లో 150 మంది విద్యార్థులు 150 సార్లు ఒకరి తరువాత ఒకరు ఆలపించారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే గణబాబు అభినందనలు

లక్కీ అమర్ స్కూల్ యాజమాన్యం చేపట్టిన ఈ దేశభక్తి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి దేశపాలకులని అన్నారు. వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి చైతన్యాన్ని నింపిన మహోన్నత గీతం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఎంఈవో త్రినాథ్‌రావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వెయ్యి మందితో ఆలాపన

గోపాలపట్నం: భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పలు విద్యా సంస్థల్లో స్మారకోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో వెయ్యిమంది విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం స్వర్ణలత మాట్లాడుతూ దేశాభి వృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే విశాఖ ఇంజనీరింగ్ కళాశాలలో వందేమాతర గీతాలాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, స్థానిక రైతుబజారులో కమిటీ సభ్యులు, రైతులు గీతాన్ని ఆలపించారు.

జాతీయ పతాకంతో ర్యాలీ

పెందుర్తి: స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాదిమందికి స్ఫూర్తి నింపిన వందేమాతర గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం పెందుర్తి ఆదిత్యనగర్‌లో ఉన్న యూనిక్ పాఠశాల 150 మీటర్ల భారీ జాతీయ జెండాను ర్యాలీ ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వరకు కొనసాగిన ఈ ర్యాలీలో విద్యార్థులు వందేమాతర గీతాన్ని ఆలపించారు. అనంతరం గేయ రచయిత బంకించంద్ర చటర్జీ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

నేవి సిబ్బంది ఆధ్వర్యంలో..

అక్కిరెడ్డిపాలెం: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు త్యాగం చేసిన దేశ భక్తుల చరిత్రలను తెలుసుకోవడంతో పాటు వారి ఆశయాల సాధనకు కృషి చేయాలని నేవీ కమాండర్ రాకేశ్ జైస్వాల్ అన్నారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన వందేమాతరం దినోత్సవ వేడుకల్లో వందేమాతరం గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఎలా చైతన్యం చేసిందో వివరించారు.

అగనంపూడి సత్రం జంక్షన్‌లో..

అగనంపూడి :వందేమాతర గీతానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అగనంపూడి సత్రం జంక్షన్‌లోని మహాత్మగాంధీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వందేమాతర గీతం ఆలపించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దేశాన్ని ప్రేమించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతుబజారులో..

ఎన్ఏడీ జంక్షన్ : మర్రిపాలెం రైతుబజారులో వందేమాతర 150 వసంతాల వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మానవహారంగా ఏర్పడి వందేమాతరం గేయం ఆలపించారు. దేశ సమగ్రతను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు.


వేపగుంట రైతు బజారులో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం


పోటీలను ప్రారంభిస్తున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు

» టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా

గాజువాక, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా స్థాయి అండర్ -14 కబడ్డీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. నిత్య జీవితంలో క్రీడలు ఓ భాగం కావాలని చెప్పారు. విజయమే లక్ష్యంగా క్రీడా స్ఫూర్తితో మెలగాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడాకారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు సౌకర్యాలు కల్పించి అధిక ప్రాధన్యత ఇస్తోందన్నారు. అనంతరం హైస్కూల్ హెచ్‌ఎం విజయ ప్రశాంతి మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన వారు ఈనెల 22 నుంచి మచిలీపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, ఏపీ ఐఐసీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్, తదితర నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పశ్చిమ ఎమ్మెల్యే పి. గణబాబు అన్నారు. నియోజకవర్గం పరిధిలోని 91, 92 వార్డులకు చెందిన 9 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.3 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే గణబాబు

టీడీపీ జాతీయ కార్యదర్శి లోకేశ్ ఆదేశాల మేరకు పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గణబాబు ఆయన నివాసంలో శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

ఘాట్ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే


అధికారులకు సూచనలిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యారాడలో నూతనంగా నిర్మించిన సీసీ ఘాట్ రోడ్డు ఒక పక్కకు ఒరిగిపోయింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, జీవీఎంసీ జోన్5 కమిషనర్ రాము, కూటమి నాయకులు శుక్రవారం ఈ రోడ్డును పరిశీలించారు. సీసీ రోడ్డు ఒక పక్కకు ఒరిగిపోవడం, భూగర్భంలో ఉన్న మిలట్రీ ఇంజనీరింగ్ సర్వీసెస్ (ఎంఈఎస్) పైప్‌లైన్ పగిలిపోవడం, రోడ్డు కింద ఉన్న మట్టి కోతకు గురవడం వంటివి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ తొలుత పైప్‌లైన్ మరమ్మతులు చేయవల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు. అలాగే ఈ రోడ్డుకు ఆనుకుని ఉన్న రక్షణ గోడ నిర్మించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో 63వ వార్డు కార్పొరేటర్ గల్లా పొలిపల్లి(చిన్న) తదితర నాయకులు పాల్గొన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

మల్కాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు లేబర్ యూనియన్ (ఇంటక్) ప్రతినిధులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులకు అక్టోబర్ 1 నుంచి వేతనాలు పెరగాల్సి ఉండగా జీతాలు పెంచలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ బొమ్మిడిరమణ తదితరులు

ఎన్ఏడీ జంక్షన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 90వ వార్డులో లక్ష్మీనగర్ కొండవాలు ప్రాంతంలో రూ.17.10లక్షల కార్పొరేషన్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శుక్ర వారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండవాలు ప్రాంత వాసుల ఇబ్బందులను ఎమ్మెల్యే గణబాబుకు వివరించడంతో ఆయన చొరవతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు శరగడం అరుణ్‌కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డాక్‌యార్డు వంతెనను ప్రారంభించాలి

» సీపీఎం నాయకులు

మల్కాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నేవల్ డాక్‌యార్డు సమీపంలో నూతనంగా నిర్మించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెనను వెంటనే ప్రారంభించాలని సీపీఎం నాయకులు కోరారు. మల్కాపురం మెయిన్ రోడ్డులో శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. గత ఏడాది ఆగస్టు 1న ఈ వంతెన పునఃనిర్మాణానికి శ్రీకారం చుట్టారని, ఏడాది గడుస్తున్నా ఇంకా వంతెన ప్రారంభం కాలేదన్నారు. అప్పుడు ప్రారంభిస్తాం.. ఇప్పుడు ప్రారంభిస్తామని చెప్పి ఇప్పటికీ పలుమార్లు మాట తప్పారని అన్నారు. తాజాగా ఈనెల 11న వంతెన ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు గానీ ఇది కూడా ప్రశ్నార్థకంగానే ఉన్నదని చెప్పారు. వంతెన మూసేయడం వల్ల చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అసహనం వ్యక్తం చేశారు.

శ్రీహరిపురం ఆస్పత్రిలో మందుల్లేవ్!

» రోగులకు తప్పని ఇక్కట్లు


శ్రీహరిపురం ఆస్పత్రి

మల్కాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ యూనిట్ (ఆస్పత్రి)లో వైద్యసేవలు కుంటుపడ్డాయి. ఇక్కడ కనీసం మందులు దొరకడం లేదు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఇక్కడ కేవలం ఇద్దరు వైద్యులు మాత్రమే ఉన్నారు. ఆస్పత్రి నుంచి మరిన్ని సేవలు అందేందుకు గాను కోరమాండల్ ఎరువుల కర్మాగారం యజమాన్యం సామాజికసేవ కార్యక్రమంలో భాగంగా రూ.10కే వైద్యం అందించాలని, అతి తక్కువ ధరలకే ఖరీదైన పరీక్షలు చేస్తామని ముందుకొచ్చింది. ఈలోగా స్థానిక కార్పొరేటర్‌తో పాటు సీపీఎం, సీపీఐ నేతలు ఉచితంగానే వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేయడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. ప్రస్తుతం ఆస్పత్రి నిర్వహణను జీవీఎంసీ చేపడుతోంది. గతంలో పారిశ్రామిక ప్రాంతం నుంచి ఈ ఆస్పత్రికి ప్రతిరోజూ సుమారు 200 మంది రోగులు వస్తుండేవారు. కాగా వైద్యులు, మందులు లేకపోవడంతో ప్రస్తుతం ఓపీకి కనీసం 50 మంది కూడా రావడం లేదు. అధికారులు స్పందించి ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్యసేవలు అందేలా చూడాలని కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి

» టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

కూర్మన్నపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కార్పొరేటర్ బొండా జగన్ పేర్కొన్నారు. డ్రైడే-ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ శానిటరీ, మలేరియా విభాగం ఆధ్వర్యంలో 87వ వార్డు లక్ష్మీపురంలో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. వారానికి ఒక్కరోజైనా డ్రైడే పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత ఎంతో అవసరం

మల్కాపురం: సీజనల్ వ్యాధులను వ్యక్తిగత పరిశుభ్రతతోనే నివారించవచ్చని జోన్ 5 కమిషనర్ రాము అన్నారు. 58వ వార్డు రామ్‌నగర్‌లో మలేరియా విభాగం ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి భద్రత అని అందరూ గుర్తించాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జోన్-5 అధికారులు, మలేరియా సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సిమెంట్ పరిశ్రమ వద్దని నిరసన


నిరసన తెలియజేస్తున్న సిమెంట్ యూనిట్ వ్యతిరేక కమిటీ సభ్యులు

పెదగంట్యాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సమీపంలో అదానీ అంబుజా సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతలు రద్దు చేయాలని సిమెంట్ యూనిట్ వ్యతిరేక ఐక్య ఉద్యమ కమిటీ శుక్రవారం సిర్వాసిత కాలనీల్లో పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటు జరగదని ప్రభుత్వం ప్రకటించే వరకూ ఆందోళనలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రాంతినగర్‌లో దొంగల హల్‌చల్


ముఖం కనిపించకుండా తిరుగుతున్న వ్యక్తి

సింధియా, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 63వ వార్డులోని క్రాంతినగర్‌లో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. అర్ధరాత్రి సమయంలో ఇద్దరు వ్యక్తులు దొంగతనానికి వచ్చి, ఇంటి యజమానిని చూసి పరుగులు తీశారు. స్థానికుల వివరాలు ప్రకారం... గురువారం అర్ధరాత్రి 3:00 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు అన్ని ఇళ్ల దగ్గర తనిఖీలు చేశారని, మేడపై నుంచి శబ్దాలు వినిపించడంతో ఓ ఇంటి యజమాని లైటు వేయగా పరుగులు తీశారని తెలిపారు. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించగా దొంగలు ముఖం కనిపించకుండా జాగ్రత్త పడ్డారు.

'తక్షణమే ఎన్నికలు జరపాలి'

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భెల్ హెచ్‌పీవీపీలో ప్రస్తుతం గుర్తింపు కార్మిక సంఘం పదవీ కాల పరిమితి ముగిసినందున ఎన్నికలు నిర్వహించాలని డిప్యూటి చీఫ్ లేబర్ కమీషనర్ (సెంట్రల్) విశ్వభూషన్‌కు భెల్ హెచ్‌పీవీపీ సీఐటీయూ నాయకులు శుక్రవారం విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక నాయకులు ఎన్నికల ఆవశ్యకతను వివరించారు. గత నెల కార్మిక సంఘాల జాబితా అడిగామని, ఇప్పటి వరకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించకపోవడం పట్ల కార్మికులు తీవ్ర నిరాశలో ఉన్నారని తెలిపారు. తక్షణమే ఎన్నికలు నిర్వహించి, కార్మికుల సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

'స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ సరికాదు'

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయకుండా, ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్రం ప్రకటించాలని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి. ఆదినారాయణ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాంటు ప్రైవేటీకరణ ఆపాలని, తొలగించిన కాంట్రాక్ట కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ఇండస్ట్రీస్ నూతన కార్యవర్గం ఎన్నిక


నూతనంగా ఎన్నికైన వారిని అభినందిస్తున్న వాసీవా ప్రతినిధులు

ఆటోనగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ ఇండస్ట్రీస్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు వాసీవా కార్యాలయంలో శుక్రవారం జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా బి. నాగిరెడ్డి, అధ్యక్షుడిగా పి. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి.ధర్మేంద్ర మంగల్, కోశాధికారిగా ఎల్.గాంధీ ఎన్నికైయారు. నూతనంగా ఎన్నికైన వారని వాసీవా అధ్యక్షుడు డాక్టర్ సజ్జా పాండురంగ ప్రసాద్ వాసీవా ప్రతినిధులు పరుచూరి ప్రభాకర్, లంకా బాపిరాజు తదితరులు సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, పలువురు పారిశ్రామిక వేత్తలు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆధునికీకరణకు చర్యలు

పెదగంట్యాడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డులో ఎస్టీ కాలనీని ఆనుకుని ఉన్న శ్మశానవాటికను రూ. 50లక్షలతో ఆధునీకరించేందుకు జీవీఎంసీ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బరియల్ గ్రౌండ్‌లో కనీస వసతులు లేవని రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు దృష్టికి తీసుకువెళ్లామని ఆయన చొరవ తీసుకుని కార్పొరేషన్ నిధులు మంజూరు చేయించారని అన్నారు. ఈ నిధులతో త్వరలో బరియల్ గ్రౌండ్‌కు అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలి'

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ యూనియన్ పూర్తిగా కృషి చేస్తోందని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి అన్నారు. అక్కిరెడ్డిపాలెంలో శుక్రవారం నిర్వహించిన పారిశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెలలో జరిగే సీఐటీయూ 18వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.

నిర్వాసితుల సమస్యలపై వినతి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులకు శాశ్వత పరిష్కారం చూపాలని నిర్వాసిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నిర్వాసిత నిరుద్యోగులు శుక్రవారం టౌన్‌షిప్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నిర్వాసిత కాంట్రాక్టు కార్మికులను కూడా యాజమన్యం తొలగించిందని ఆరోపించారు.

వందే మాతరం

వందేమాతరం గేయానికి 150 వసంతాలు పూర్తైన సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సామూహికంగా గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా గేయం గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో జాతీయ మంత్రమన్నారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


కలెక్టరేట్‌లో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్


అడివివరం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో వందేమాతరం గేయాన్ని ఆలపిస్తున్న విద్యార్థులు


జిల్లా పరిషత్ కార్యాలయంలో ...


గోపాలపట్నం బాలికోన్నత పాఠశాలలో...


మధురవాడ భాష్యం స్కూల్‌లో...


ఎంవీపీ కాలనీ సత్యసాయి విద్యావిహార్‌లో వందేమాతరం గేయాలాపన..


వందేమాతరం పదం ఆకారంలో కూర్చున్న డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

నేటి నుంచి కెనరా బ్యాంకు ఉద్యోగుల జాతీయ సమ్మేళనం


రవికుమార్

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు అధికారుల సంఘం 20వ త్రైవార్షిక జాతీయ సమావేశాలు శనివారం నుంచి నగరంలో ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు రాడిసన్ బ్లూ హోటల్‌లో సమావేశాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు సంఘం జనరల్ సెక్రటరీ కె.రవికుమార్ తెలిపారు. సుమారు 50 వేల మంది అధికారులు కలిగిన సంఘ సమావేశాలకు 6,500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. కెనరా బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈవో కె.సత్యనారాయణరాజు ముఖ్య అతిథిగా పాల్గొంటారని రిసెప్షన్ కమిటీ చైర్మన్ రమాప్రసాద్ తెలిపారు.

11న ఐటీఐ అభ్యర్థులకు జాబ్‌మేళా

కంచరపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాత ఐటీఐలో ఈ నెల 11న ఐటీఐ అభ్యర్థులకు జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. వివిధ కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగులకు మౌఖిక పరీక్ష నిర్వహిస్తారన్నారు. మార్క్స్, కోబ్, ఎంఆర్ఎఫ్, జేఎస్ ఆటో, అశోక్ లేల్యాండ్, టాటా ఎలక్ట్రానిక్స్, టొయోటా, ప్రీమియం ఎనర్జీ తదితర కంపెనీలు అభ్యర్థులను ఎంపిక చేస్తాయన్నారు. ఐటీఐ, డిప్లొమా కోర్సులు పాసైన అభ్యర్థులు ఉదయం 10 గంటలకు ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు.

ఏపీ చాంబర్స్ విశాఖ జోన్ కార్యవర్గం బాధ్యతల స్వీకరణ


విశాఖజోన్ నూతన కార్యవర్గం

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ విశాఖ జోన్ కార్యవర్గం శుక్రవారం బాధ్యతలు స్వీకరించింది. హోటల్ దసపల్లాలో చైర్మన్‌గా పి.శోభన్‌ప్రసాద్, వైస్ చైర్మన్లుగా ఎంవీ పవన్‌కార్తీక్, జి.శివకుమార్, కార్యదర్శిగా డాక్టర్ ఎం .త్రినాథ్, సంయుక్త కార్యదర్శిగా ఆర్.రామకృష్ణారావు, కోశాధికారిగా సీఏడీఎం రావు బాధ్యతలు స్వీకరించారు. ఏపీ మెడ్‌టెక్ జోన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జితేంద్రశర్మ, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ హాజరయ్యారు. ఏపీ చాంబర్స్ రాష్ట్ర అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ పాల్గొన్నారు. విజయవాడలో డిసెంబరు 12 నుంచి జరగనున్న బిజినెస్ ఎక్స్‌పో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అధికారిక సోషల్ మీడియా పేజీలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, లింక్‌డ్ ఇన్, యూట్యూబ్ చానళ్లను ప్రారంభించారు.

నూతన ఒరవడికి నాంది పలికిన 'సంధ్య'

» చల్లని సాయంత్రం విద్యార్థులతో సరదాగా గడిపిన ఏయూ అధికారులు


విద్యార్థినులతో ముచ్చటిస్తున్న ఏయూ ప్రొఫెసర్

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సంధ్య పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి శుక్రవారం అమలు చేశారు. నిత్యం పాఠాలు బోధించే ప్రొఫెసర్లు జీవిత పాఠాలను బోధిస్తూ విద్యార్థులకు మార్గదర్శకులుగా మారారు. చల్లని సాయంత్రం వేళ విద్యార్థులతో మమేకమై ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించారు. 'నా విభా గం- నా కుటుంబం' నినాదంతో నూతనంగా ప్రారంభించిన సంధ్య కార్యక్రమాన్ని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రారంభించారు సీనియర్, జూనియర్ విద్యార్థులంతా స్నేహితులుగా మారి బృందాలుగా కూర్చుని మనసుకు నచ్చిన అంశాలను ముచ్చటించారు. సీనియర్లు తమ అనుభవాలను, అనుభూ తులను పంచుకున్నారు. అంతలోనే అక్కడకు చేరుకున్న ప్రొఫెసర్లు విద్యార్థుల పక్కనే కూర్చుని వారి ఆలోచనలను, భావాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. కార్యక్రమాన్ని వినూత్నంగా విద్యా ర్థులతో జ్యోతి ప్రజ్వలన చేసి ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ విధానం ఆలోచనలకు పంచుకునే వేదికగా నిలవాలన్నారు. విభాగాధిపతి ప్రొఫె సర్ సీఎన్‌వీ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, ప్రొఫెసర్ల మధ్య సంభాషణలు పెరగ డానికి, విభాగంలో మంచి వాతావరణం పెంపొందించడానికి ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి.కింగ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, ప్రొఫెసర్లు, పరిశోధకులు, పీజీ, యూజీ విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాన్ని జాగృతం చేసే సినిమాలు రావాలి


దర్శకుడు రామ్ జగదీశ్‌ను సత్కరిస్తున్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

» కోర్టు చిత్రం దర్శకుడు రామ్ జగదీశ్

సీతంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సమాజాన్ని జాగృతం చేసే సినిమాలు రావాల్సిన అవసరం ఉందని కోర్టు చిత్ర దర్శకుడు రామ్ జగదీశ్ అన్నారు. వినోదంతో పాటు సమాజాన్ని చైతన్యం పరిచే చిత్రాలను ప్రేక్షకులు ఆదరిస్తారని, తాను అదే కోవలో పయనిస్తానన్ని తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో కోర్టు సినిమాను శుక్రవారం ఉచితంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా దర్శకుడు రామ్ జగదీష్‌తో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దర్శకుడిని నిర్వాహకులు సత్కరించారు. ఈ సందర్భంగా రామ్ జగదీశ్ మాట్లాడుతూ సున్నితమైన అంశాలను అన్నివర్గాల ప్రజలకు అర్థమయ్యే రీతిలో చెప్పగలిగితే మార్పు వస్తుందన్నారు. విశాఖ వాసిగా మంచి చిత్రాలను తీసేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. వైజాగ్ ఫిల్మ్ సొసైటీ గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ మంచి సినిమాలను ప్రజలకు చూపించడమే ఫిల్మ్ సొసైటీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పౌరగ్రంథాలయ సొసైటీ ప్రధాన కార్యదర్శి డీఎస్ వర్మ, వైజాగ్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు కాశీ విశ్వేశ్వరరావు, బి.చిన్నారావు, ఆర్.శివశంకర్, ఎస్.ఉషారాణి, డాక్టర్ జ్ఞానేశ్వర్ బాబ్జీ, డి.గాయత్రి, రాంప్రభు, సత్యవతి, అనురాధపాల్గొన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

» బీవీకే చైర్మన్ నాగేశ్వరరావు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వరరావు

ఎండాడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందించి స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని భారతీయ విద్యా కేంద్రం చైర్మన్, ఏయూ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.నాగేశ్వరరావు అన్నారు. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ ఆంధ్రప్రదేశ్ పురుషులు, మహిళల అంతర్‌జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలను శుక్రవారం విశాలాక్షినగర్‌లోని బీవీకే పాఠశాలలో ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఎస్టీఆర్ వైద్య సేవల చైర్మన్ సీతంరాజు సుధాకర్ యువత మైదానంలో చూపించే ప్రతిభ, భవిష్యత్తుకి పునాది అన్నారు. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సునీల్ మహంతి పలు జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటుతూ పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీవీకే కార్యదర్శి వి.సత్యనారాయణ, టీఎస్సార్ ప్రసాద్, టి.చెంగల్రాయనాయుడు, జి.చక్రవర్తి, భూషణరావు,మూర్తి, సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన రైల్వే మాక్ డ్రిల్


రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్న రైల్వే భద్రతా సిబ్బంది

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింహాచలం రైల్వే స్టేషన్‌లో వాల్తేరు రైల్వే నిర్వహించిన రియల్ టైమ్ రెస్క్యూ డ్రిల్ అబ్బురపరిచింది. రైలు పట్టాలు తప్పడం, ఊహించని ప్రమాదాలకు గురైన సమయంలోనే కాకుండా విపత్తు సంభవించినపుడు ప్రయాణికులను కాపాడడం, ప్రథమ చికిత్స అందించడం మాక్ డ్రిల్ ద్వారా ప్రదర్శించారు. కోచ్‌లలో చిక్కుకుపోయిన ప్రయాణికులకు సురక్షితంగా బయటకు తీసుకురావడం, క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా ఆసుపత్రులకు తరలించడం, గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించడం, మంటలు రేగిన కోచ్‌లను అగ్నిమాపక దళాల ద్వారా అదుపు చేయడం, నీటిలో చిక్కినవారిని రక్షించే విధానాలను చేసి చూపించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం లలిత్ బొహ్రా మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో ప్రయాణికులను రక్షించేందుకు అనుసరించే పద్ధతులు, సహాయ చర్యలను ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఊహించని సంఘటనల సమయంలో ప్రాణాలను కాపాడడానికి సంసిద్ధత ముఖ్యమని ఈ సందర్భంగా డీఆర్ఎం పేర్కొన్నారు.


బోగీలోంచి ప్రయాణికులను రక్షిస్తున్న దృశ్యం


బాధితులకు ప్రథమి చికిత్స

క్రైం... crime news

లారీ ఢీకొని యువకుడి మృతి


శేషు మృతదేహం

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన షీలానగర్ - విమానాశ్రయం మధ్య జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిందది. గాజువాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మర్రిపాలేనికి చెందిన తోటకూర శేషు (33) గంగవరం పోర్టులో పనిచేస్తున్నాడు. విధులకు హాజరయ్యేందుకు శుక్రవారం తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా విమానాశ్రయం దాటిన తరువాత కంటైనర్ యార్డును కలపుతూ నిర్మిస్తున్న బ్రిడ్జి సమీపంలో టిప్పర్ ఢీకొటింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి రెండేళ్ల కిందట వివాహమయింది. భార్య, ఎనిమిది నెలల వయసున్న కుమారుడు వున్నారు. పోలీసులు వివరాలను సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో పాత నేరస్థుడి అరెస్టు

» వజ్రపు లాకెట్లు, బంగారు ఆభరణాల రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నరసింహమూర్తి

సీతంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార ఏఎస్ఆర్‌నగర్‌లో ఈ ఏడాది జూలైలో ఓ ఇంట్లో దొంగలు చొరబడి వజ్రపు లాకెట్లు, బంగారు ఆభరణాలు దోచుకుపోయిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏసీపీ క్రైమ్ ఇన్‌చార్జి అన్నెపు నరసింహమూర్తి వివరాలు వెల్లడించారు. ఏఎస్ఆర్‌నగర్‌లో ఉంటున్న గుంటూరు విక్రమ ఆదిత్యవర్మ జూలైలో పశ్చిమ గోదావరి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి బీరువా పగులగొట్టి ఉంది. అందులో వజ్రపు లాకెట్లు, బంగారు ఆభరణాలు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో భాగంగా పాత నేరస్థుడు బసవ కిరణ్‌కుమార్ ఈ ఘటనకు పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చి విచారించగా పలు ప్రాంతాల్లో కుదవపెట్టిన ఆభరణాల వివరాలను తెలిపాడు. ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో బృందాలు ముత్తూట్‌తో సహా మరిన్ని ప్రాంతాల్లో కుదువపెట్టిన బంగారు, వజ్రపు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ వి.చక్రధరరావు, ఎస్ఐ ఎస్.రాజు, ఏఎస్ఐ డి.కిశోర్, కానిస్టేబుళ్లు ఎన్.అప్పలరాజు, ఎన్.రాజు, ఎస్.అప్పలనాయుడు, ఎస్.హరిప్రసాద్, ఎన్.జగత్ కిరణ్, జి.రవికుమార్, కె.అగస్టిన్‌లను ఏసీపీ అభినందించారు.

మంటల్లో చిక్కుకుని వృద్ధురాలి మృతి

వేపగుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంటల్లో చిక్కుకుని ఓ వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన వేపగుంట అప్పన్నపాలెం సమీప వర్షిణీ టవర్స్‌లో శుక్రవారం జరిగింది. పెందుర్తి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వర్షిణీ టవర్స్ ఎఫ్.బ్లాక్‌లో జయంతి సీతాదేవి(66) కుటుంబం నివాసం ఉంటోంది. ఉదయం తన మనవరాలు శ్రీనయనను ఎత్తుకుని టీవీ ఆన్ చేసింది. అదే సమయంలో మంటలు వ్యాపించాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ప్రమాదం సంభవించిందా లేక అదే ప్రాంతంలోని దీపం అంటుకుని వ్యాపించాయా అన్నది తెలియరాలేదు. మంటలు రేగడంతో ఆమె పెద్దగా కేకలు వేయడంతో ఎదురింటివారు వచ్చి రక్షించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందింది. చిన్నారి శ్రీనయనకు గాయాలయ్యాయి. పోలీసులు, విద్యుత్ సిబ్బంది, క్లూస్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీస్తున్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.1.3 లక్షల విలువ చేసే 26 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో మహారాష్ట్రకు చెందిన పూనమ్ అశోక్ కాలే (25) రైల్లో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని పోలీసులు తెలిపారు.

గౌరీ పరమేశ్వరుల హుండీ చోరీ

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 69వ వార్డు వెంకటేశ్వరకాలనీలో నిర్వహిస్తున్న గౌరీ పరమేశ్వరుల మహోత్సవాల వేదికపై ఉంచిన హుండీని దొంగలు మాయం చేశారు. గురువారం రాత్రి 11 గంటల వరకు పూజలు జరిపిన తరువాత నిర్వాహకులు వెళ్లిపోయారు. శుక్రవారం వేకువజామున చూడగా హుండీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జడ్పీ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

మహారాణిపేట, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులకు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర దీన్ని ప్రారంభించారు. జిల్లా పరిషత్, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో నారాయణమూర్తి, వైద్యనిపుణులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్మిక రాజ్య స్థాపనకు పోరాడుదాం

» సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నరసింగరావు



కార్మిక ప్రదర్శనలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నరసింగరావు

డాబాగార్డెన్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు విప్లవ స్ఫూర్తితో కార్మిక రాజ్యస్థాపనకు పోరాడుదామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం సరస్వతీ పార్కు నుంచి సిటీ సెంట్రల్ పార్కు వరకు కార్మిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దుచేయాలని, 8 గంటల పనిదినాన్ని అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరిగే సీఐటీయూ మహాసభల్లో పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. ఈ సభలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 1,500 మంది ట్రేడ్ యూనియన్ నాయకులు హాజరవుతారన్నారు. కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రదర్శనలో భాగంగా ఎర్ర చొక్కాలు, చీరలు ధరించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కేఎస్వీ కుమార్, ఎం.జగ్గునాయుడు, జగన్, మణి, వి.రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ త్వైకాండో పోటీలకు అడివివరం విద్యార్థి


జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థితో హెచ్‌ఎం

సింహాచలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు అడివివరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థి నెకెళ్ల వంశీ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు తెలిపారు. ఈనెల 3,4 తేదీల్లో ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడన్నారు. ఈ మేరకు శుక్రవారం అతడిని అభినందించి, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.